



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 258 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | మంగళవారం 09 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-





## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో

## 9 మంది కార్మికుల మృతి

# భారీ అగ్నిప్రమాదం

**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం స్టీల్‌ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2, ఎస్‌టీసీ-3 హీట్ ఎఫ్‌జీలో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ పేలడంతో ఉక్కుద్రవం లీకై మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 9 మంది మృతి చెందగా.. పలువురు గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. 1,500 డిగ్రీల వేడితో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ ద్వారా ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం సంభవించడంతో భయాందోళనకు గురైన కార్మికులు, ఉద్యోగులు బయటకు పరుగులు తీశారు. అగ్నిప్రమాక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నారు. మృతులు అప్పారావు, ప్రభాకర్‌రావు, కృష్ణ, రమణ, త్రినాథ్, అప్పలరాజు, కుమార్‌గా గుర్తించారు. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. వీరిలో ఐదుగురు విశాఖ స్టీల్ ఉద్యోగులు కాగా.. ముగ్గురు ఒప్పంద కార్మికులని అధికారులు తెలిపారు.

**ప్రధాని మోదీ తీవ్ర విచారం**

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. మృతుల కుటుంబాలకు మోదీ ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. పీఎం నేషనల్ రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ. 2లక్షలు, క్షతగాత్రులకు రూ. 50వేలు చొప్పున పరిహారం అందించనున్నట్లు తెలిపారు.

**సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి**

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై ఏపీ సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటనపై అధికారులతో మాట్లాడారు. పలువురు కార్మికులు చనిపోవడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని, అన్ని శాఖలు సమన్వయంతో సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలను స్టీల్ ప్లాంట్ అధికారులు చంద్రబాబుకు వివరించారు.

**స్పందించిన కేంద్రమంత్రి కుమారస్వామి**

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదంపై కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖమంత్రి హెచ్‌డీ కుమారస్వామి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సంబంధిత మిగతా .. 2లో..

# 2027 నాటికి భూ రికార్డులు క్లీన్

- రికార్డుల పూర్తి ప్రక్షాళనకు 3 ఏళ్ల సమయం
- కరెన్సీ నోట్ల తరహాలో పాస్ పుస్తకాలకు భద్రతా ఫీచర్లు
- రాష్ట్రంలో రాజకీయం చేసే అర్హత గొడ్డలి పార్టీకి ఎక్కడిది..?
- గొడ్డలి పట్టే చేతులకు నాగలి పట్టే చేతులు ఎలా గుర్తుంటాయి...?
- మేం రాజముద్రతో పట్టాలిస్తున్నాం... వాళ్లు దొంగ పట్టాలు సృష్టిస్తున్నారు
- ప్రజలకు, నిరుద్యోగులకు ఆ పార్టీ క్షమాపణలు చెప్పాలి
- సిద్ధాంతంలో మీ భూమి- మీ హక్కు సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు







**ఆచంట, విశ్వం వాయిస్ న్యూస్ :** 2027 నాటికి రాష్ట్రంలో భూ రికార్డులను ప్రక్షాళన చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గత పాలకులు పశ్చిమ గోదావరి జిల్లా లాంటి పచ్చని ప్రాంతంలోనూ భూ చిచ్చు పెట్టారని ముఖ్యమంత్రి ఆక్షేపించారు. గజం భూమిని కూడా సద్వినియోగం చేసుకునే రైతులనూ గత ప్రభుత్వం వదిలి పెట్టలేదని తీవ్రస్థాయిలో ఆరోపించారు. పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలో మీ భూమి- మీ హక్కు పేరిట రాజ ముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. దుర్మార్గమైన గత పాలకుల నిర్వాకంతో రికార్డులన్నీ గందరగోళంగా తయారయ్యాయని ప్రజలకు చెందిన మిగతా .. 2లో..

### చెప్పినట్టుగానే పెద్దాయనను

## కలిసిన చంద్రబాబు



**ఆచంట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు 96 ఏళ్ల వృద్ధుడి జీవితకాల కోరికను నెరవేర్చి, తన మానవత్వాన్ని చాటుకున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా కామధేనువులంక గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే వృద్ధుడు, తన అభిమాన నేత అయిన చంద్రబాబును కలవాలని చిరకాలంగా ఆశిస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఈ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి, సోమవారం తన జిల్లా పర్యటనలో భాగంగా ఆయన్ను ప్రత్యేకంగా కలుసుకున్నారు. ఈ సమావేశం మిగతా .. 2లో..

### లోకేష్ నాయకత్వంలో మరో 50 ఏళ్లు

# టీడీపీకి తిరుగులేదు

**అడిలైడ్ మహానాడులో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు**



**విశ్వం వాయిస్ న్యూస్ :** సౌత్ ఆస్ట్రేలియాలోని అడిలైడ్ నగరంలో ఎన్ఆర్ఐ టీడీపీ ఆధ్వర్యంలో మహానాడు పండుగ అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవాసాంధ్రులను ఉద్దేశించి ఆయన ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, స్వర్గీయ నందమూరి తారకరామారావు ఆశయాల స్ఫూర్తితో, జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అడుగుజాడల్లో నడుస్తూ, మూడో తరం నాయకుడిగా జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పార్టీని అద్భుతంగా నడిపిస్తున్నారని కలిశెట్టి కొనియాడారు. లోకేష్ గారి సమర్థవంతమైన నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ భవిష్యత్తుకు ఇంకో 50 ఏళ్ల పాటు ఎలాంటి ఢోకా లేదని, తిరుగులేని భరోసా లభించిందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలందరూ లోకేష్ నాయకత్వం పట్ల మిగతా .. 2లో..

### ఆంధ్రా పేపర్ మిల్స్‌కు

# షోకాజ్ నోటీసులివ్వండి

**అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ ఆదేశం**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరిలో కాలుష్యానికి కారణమవుతున్న ఆంధ్రా పేపర్ మిల్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ఆదేశించారు. ఇటీవల రాజమహేంద్రవరంలో గోదావరి నది కాలుష్యాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆ రోజు సేకరించిన నమూనాలను ప్రయోగశాలలో పరీక్షించిన అనంతరం వచ్చిన నివేదికలపై రాజమహేంద్రవరం జిల్లా అధికారులతో పవన్ సమీక్షించారు. నిర్దేశిత పరిమాణం కంటే భారీ స్థాయిలో ప్రమాదకర రసాయనాలు గోదావరిలో కలుస్తున్నట్లు నివేదికలో తేలిందని పవన్ కల్యాణ్ చెప్పారు. ఇంత జరుగుతుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. నెలకోసారి నమూనాలు సేకరిస్తున్నట్లు అధికారులు బదులు ఇచ్చారు. మరి అలాంటప్పుడు ఇంత కలుషితమవుతుంటే చర్యలు ఎందుకు మిగతా .. 2లో..


# రామోజీరావు ద్వితీయ వర్ధంతి..

### కుటుంబ సభ్యుల నివాళులు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** రామోజీ గ్రూప్ సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, ఉద్యోగులు ఘనంగా నివాళులర్పించారు. రామోజీ ఫిల్మ్‌సిటీలోని స్మృతివనంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం అక్కడ నిర్వహించిన సంస్మరణ సభలో రామోజీరావు జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

## దాడులు నిలిపివేస్తామంటూనే హెచ్చరించిన ఇరాన్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇజ్రాయెల్‌పై దాడులను నిలిపివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. ఒకవేళ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను కొనసాగిస్తే.. తాము మరింత తీవ్రంగా స్పందిస్తామని హెచ్చరించింది. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఘర్షణలు మళ్లీ తీవ్రస్థాయికి చేరుకున్నాయి. ఈక్రమంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరుదేశాలు ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని.. శాంతి, సుస్థిరతను నెలకొల్పాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఐఆర్‌జీసీ ఈ ప్రకటన చేసింది. సోమవారం టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ ప్రయోగించిన పలు డ్రోన్‌లను తమ వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చేశాయని మిగతా .. 2లో..

### మోదీ ఏం చేశారో?

# నేనేం చేశానో చర్చకు సిద్ధం

**తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఔటర్ రింగు రోడ్డు లోపలి 1.34 కోట్ల మందికి మౌలిక వసతుల కల్పన, ఇతర అంశాల్లో పాలనా సమన్వయం కోసమే మూడు కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సైబరాబాద్‌లో రూ. 1,674.74 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు 6 నెలల ముందు రాజకీయాలు మాట్లాడుకుందామని, ఈ రెండేళ్లు కలిసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. సైబరాబాద్‌లో అనేక ఐటీ కంపెనీలు ఉన్నాయని, దేశ ఐటీ ఎగుమతుల్లో 16.77 శాతం హైదరాబాద్ నుంచే వెళ్తున్నాయని చెప్పారు. "దేశంలోని ప్రధాన నగరాలైన దిల్లీ, ముంబయి, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్ దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్నాయి. ఈ ప్రధాన నగరాల్లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. కాలుష్యం వల్ల దిల్లీలో స్కూళ్లు, ప్రధాని కార్యాలయాన్నే మూసేశారు. మన హైదరాబాద్ నివాసానికి అనుకూలంగా ఉంది. పెద్ద నగరాలకు ఉన్న సమస్యలు మిగతా .. 2లో..

### పశ్చిమాసియాలో

# మళ్లీ దాడులు

### స్పందించిన భారత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఇరాన్-ఇజ్రాయెల్ పరస్పర దాడులతో పశ్చిమాసియా మరోసారి భగ్గుమంది. ఈ పరిణామాలపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణమే ఉద్రిక్తతలను తగ్గించుకుని, శాంతియుత పరిష్కారం కోసం ప్రయత్నించాలని కోరింది. "పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు నెలకొనడం విచారకరం. ఈ పరిణామాలు అంతర్జాతీయ సమాజానికి అత్యంత ఆందోళన కలిగిస్తున్నాయి. 100 రోజులకు పైగా కొనసాగుతోన్న ఈ ఘర్షణల కారణంగా ఇప్పటికే భారీ నష్టం వాటిల్లింది. ప్రపంచ మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

అధికారులతో మాట్లాడాని, అక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ ప్రమాదానికి దారి తీసిన పరిస్థితులను అధికారులు పరిశీలిస్తున్నారని.. బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులకు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. కార్మికుల భద్రత, శ్రేయస్సే తమకు అత్యంత ప్రాధాన్యత అని పేర్కొన్నారు.

**మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలి : కిషన్ రెడ్డి**

విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటనపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో పలువురు కార్మికుల ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపిన ఆయన.. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించాలని కోరారు. మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరారు.

**విశాఖకు హోంమంత్రి అనిత**

విజయనగరం పర్యటనలో ఉన్న హోంమంత్రి అనిత.. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన విశాఖకు బయలుదేరారు. విశాఖ జిల్లా కలెక్టర్, నగర పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రమాదానికి సంబంధించి వివరాలపై ఆరా తీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి అనిత హామీ ఇచ్చారు. కేంద్రమంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ఘటనపై ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు సూచించారు.

**రేపు విశాఖకు పవన్ కళ్యాణ్, నారా లోకేష్... మృతుల కుటుంబాలకు పరామర్శ**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో సోమవారం సాయంత్రం జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 9 మంది కార్మికులు మరణించారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం, సహాయక చర్యలను ముమ్మరం చేసింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మంగళవారం విశాఖపట్నంలో పర్యటించి, మృతుల కుటుంబాలను పరామర్శించనున్నారు. వివరాల్లోకి వెళ్తే, స్టీల్ మెల్టింగ్ షాప్-1లో సోమవారం సాయంత్రం ఈ విషాదం చోటుచేసుకుంది. సుమారు 1,600 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఉన్న ఉక్కు ద్రవంతో కూడిన భారీ ల్యాడిల్ ఒక్కసారిగా పేలిపోయింది. దీంతో వందల టన్నుల ఉక్కు ద్రవం నేలపై పడటంతో అక్కడ విధుల్లో ఉన్న 9 మంది కార్మికులు సజీవ దహనమయ్యారు. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. క్రేన్‌కు ఉన్న జెట్టీ విరిగిపడటమే ప్రమాదానికి ప్రాథమిక కారణంగా భావిస్తున్నారు. సమాచారం అందుకున్న వెంటనే సహాయక బృందాలు రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తెచ్చాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా కాలిపోవడంతో వాటిని గుర్తించడం సవాలుగా మారింది. ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విశాఖ కలెక్టర్, పోలీస్ కమిషనర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, బాధిత కుటుంబాలకు అండగా నిలవాలని ఆదేశించారు. మంత్రి నారా లోకేష్ కూడా ఈ ఘటనను తీరని విషాదంగా పేర్కొన్నారు.

**విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంపై కేంద్ర మంత్రి భూపతిరాజు స్పందన**

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో సోమవారం సంభవించిన లాడిల్ పేలుడు ప్రమాదంపై కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘోర ప్రమాదంలో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోవడంతో తను తీవ్రంగా కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటనపై స్పందించిన ఆయన.. ప్రమాదం జరిగిన వెంటనే ప్లాంట్ యాజమాన్యంతో పాటు స్థానిక అధికారులతో మాట్లాడి వివరాలు సేకరించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని తాము నిశితంగా గమనిస్తున్నామని చెప్పారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య సహాయం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. పారిశ్రామిక భద్రతకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని శ్రీనివాసవర్మ స్పష్టం చేశారు. ఈ కష్ట సమయంలో కార్మికులకు, వారి కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో సోమవారం సాయంత్రం ఘోర ప్రమాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ద్రవ ఉక్కుతో ఉన్న లాడిల్ ఒక్కసారిగా పేలడంతో ఎనిమిది మంది కార్మికులు మృత్యువాత పడగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

## చెప్పినట్టుగానే పెద్దాయనను కలిసిన చంద్రబాబు

అత్యంత భావోద్వేగభరితంగా సాగింది. సత్యనారాయణను చంద్రబాబు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని, ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన నూరేళ్లు నిండు ఆరోగ్యంతో జీవించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఇరువురూ కాసేపు ఆత్మీయంగా ముచ్చటించుకున్నారు. ముఖ్యమంత్రిని కలిసిన ఆనందంలో సత్యనారాయణ స్పందిస్తూ "ఇక రెండు రోజులు భోజనం చేయకపోయినా పర్వాలేదు, నా మనసు నిండిపోయింది" అని ఆనందం వ్యక్తం చేశారు. నాయకుడికి, అభిమానికి మధ్య ఉన్న ఈ అనుబంధాన్ని చూసి నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆచంట నియోజకవర్గంలోని సిద్ధాంతం గ్రామంలో నిర్వహించిన 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులకు సవరించిన పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారు. తన అధికారిక కార్యక్రమాల ఒత్తిడిలోనూ సమయం కేటాయించి, ఒక సామాన్య అభిమాని కోరికను తీర్చడం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.

## 2027 నాటికి భూ రికార్డులు క్లీన్

భూముల విషయంలో సమస్యలు సృష్టించారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన భూ రికార్డులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం చేశారని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లాంటి దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేసి యాజమాన్య హక్కుల్ని రక్షించామని వివరించారు. క్యూ ఆర్ కోడ్ సహా కరెన్సీ నోట్ల తరహాలోనే అత్యంత పటిష్టమైన భద్రతా ఫీచర్లతో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తున్నామని తెలిపారు. గత పాలకులు చేసిన అవకతవకల కారణంగా భూమి రికార్డుల ప్రక్షాళనకు 3 ఏళ్ల సమయం పడుతుందని సీఎం అన్నారు. దేశంలోనే తొలిసారి బ్లాక్ చైన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రతీ యూనిట్ కు శాశ్వతమైన బ్లాక్ చైన్ ఐడీలు ఇస్తున్నామని.. దీని ద్వారా రికార్డులను ట్యాంపరింగ్ చేసేందుకు అవకాశం ఉండదని తెలిపారు. ప్రజల ఆస్తి పత్రాలపై ఫోటోలు ముద్రించుకున్నారని.. పొలం సరిహద్దు రాళ్లపై బొమ్మల కోసం రూ.800 కోట్లు ఖర్చు పెట్టారని అన్నారు. ప్రస్తుతం భూముల రీసర్వే ప్రక్రియలో రైతులను కూడా భాగస్వాములను చేస్తున్నామని... ఈకేవైసీ చేశాకే పట్టాదారు పాస్ పుస్తకాలను ముద్రించి రైతులకు అందిస్తున్నామని అన్నారు. ఇప్పటికే 6688 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి భూమి రికార్డులను అప్డేట్ చేశామని అన్నారు. 26.46 లక్షల మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేశామన్నారు. వచ్చే 9 నెలల్లో మరో 10,357 గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 67.32 లక్షల పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. 2027 నాటికి రాష్ట్రంలో ప్రతీ రైతు వద్దా తప్పులేని పాస్ పుస్తకం ఉంటుందని అన్నారు.

**రెవెన్యూ శాఖలో సమూల మార్పులు**

రెవెన్యూ శాఖలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని... రీ-సర్వే 2.0 కింద ఇప్పటికే 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామని సీఎం వివరించారు. విక్రయం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటో మ్యుటేషన్ తెచ్చామని తెలిపారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేశామని... రూ.10 లక్షల లోపు ఆస్తులకు రూ.100తో బదిలీ చేస్తున్నామని స్పష్టం చేశారు. 1బీ, అడంగల్, డీకేటీ, ఇనాం, సీలింగ్ వంటి పాత రికార్డుల డిజిటైజేషన్ ప్రక్రియ చేపట్టామని అన్నారు. 80 శాతం ఈ-కేవైసీ పూర్తయిన తర్వాతే గ్రామాలను వెబ్ ల్యాండ్ 2.0లోకి తీసుకువస్తున్నామని అన్నారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు, ట్రాకింగ్ సౌకర్యం కల్పించామన్నారు. రాష్ట్రంలోని 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీసు ఇనామ్ భూములను 22 ఏ నుంచి తప్పించామని తెలిపారు. తిరుపతి జిల్లాలో దశాబ్దాలుగా వివాదంలో ఉన్న శెట్టిపల్లి గ్రామ భూములను పరిష్కరించి వారికి అప్పగించామన్నారు. ఆక్వా రైతులకు అండగా నిలబడ్డామని సీఎం స్పష్టం చేశారు. గోదావరి జిల్లాల్లో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలతో పాటు, ఆక్వా రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. ఆక్వా జోన్ పరిధిలోని చెరువులకు రూ.1.50కే యూనిట్ విద్యుత్ అందిస్తున్నామని స్పష్టం చేశారు.

**రెండేళ్లుగా సమపాళ్లలో సంక్షేమం- అభివృద్ధి**

కూటమి ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకున్నామని సంక్షేమం- అభివృద్ధి-సుపరిపాలన అందిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఈ అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా తిరుపతి, అమరావతి, విశాఖలో మూడు ప్రాంతాల్లో మూడు సభలు నిర్వహిస్తున్నామని సీఎం తెలిపారు. అభివృద్ధిని ట్రాక్ లో పెట్టామని .. పెట్టుబడులు ఉద్యోగాల కల్పన జరుగుతోందని అన్నారు. సంక్షేమంలో దేశంలో ఎవరూ చేయలేని విధంగా ప్రజలకు మేలు చేస్తున్నాం అని వివరించారు. సూపర్ సిక్స్ లో చెప్పినవాటికంటే అదనంగా ఇచ్చామని తెలిపారు. పెన్షన్, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, ఆటోడ్రైవర్లు, మత్స్యకారులు ఇలా అందరికీ సంక్షేమం అందిస్తున్నామని వివరించారు.

**గొడ్డలి పార్టీది ఓర్వలేనితనం**

డీఎస్సీ ద్వారా దాదాపుగా 16 వేల మందికి టీచర్ ఉద్యోగాలు ఇచ్చామని .. పరీక్షలు అంటే తెలీని వ్యక్తులు, రిజర్వేషన్ల గురించి అవగాహన లేని వాళ్లు బురద జల్లే ప్రయత్నం చేస్న్?న్నారని సీఎం ఆరోపించారు. గత పాలకులు జాబ్ క్యాలెండర్ ఇస్తామని దగా చేశారని.. కూటమి ప్రభుత్వం వచ్చాకే ఉద్యోగాలు ఇచ్చి జాబ్ కేలండర్ విడుదల చేశామన్నారు. దీన్ని చూసి ఓర్వలేకే నేరాలు ఘోరాలు చేసి ఎదుటివారిపై దుష్ప్రచారం చేస్తోందని అన్నారు. గొడ్డలి పార్టీ చరిత్ర రాష్ట్రంలో అందరికీ తెలుసని... నేరాలు చేసి ఎదుటి వాళ్లపై నెట్టేస్తుందని ఆక్షేపించారు. చేసిన ప్రతీ ఆరోపణకూ మంత్రులు అధికారులు పూర్తిగా వివరణ ఇచ్చారని.. దీనికి ఆ వైపు నుంచి సమాధానం లేదని అన్నారు. అసలు రాష్ట్రంలో రాజకీయాలు చేసే అర్హత ఆ పార్టీకి లేదన్నారు. రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులను గొడ్డలి పార్టీ నేతలు క్షమాపణలు కోరాలన్నారు. ప్రజల్ని క్షమాపణ కోరకుండా రాష్ట్రంలో రాజకీయాలు చేసేందుకు గొడ్డలి పార్టీకి అర్హత లేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు వెళ్లాలంటే గొడ్డలి పార్టీ వ్యక్తులను దూరంగా పెట్టాలని సీఎం వ్యాఖ్యానించారు.

**అందరి ఆరోగ్యం కోసం యోగాంధ్ర**

అనంతరం పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్‌పై జిల్లా నివేదికను ముఖ్యమంత్రి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందించే వివిధ పౌరసేవలను మెరుగ్గా అందించటంలో కృషి చేస్తున్న అధికారులను అభినందించారు. ఆగస్టు 15 లోగానే రాష్ట్రవ్యాప్తంగా సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డుల కార్యక్రమాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకు రానున్నట్టు వివరించారు. ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నది మా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. త్వరలో రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే కూటమి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మృగశిర కార్తెను పురస్కరించుకుని చేపలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. జూన్ 21 తేదీన రాష్ట్రంలో కోటి మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆక్వా వ్యర్థాల ద్వారా తయారైన ఉప ఉత్పత్తులను పరిశీలించి తయారీ దారులను ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తదితరులు హాజరయ్యారు.

## టీడీపీకి తిరుగులేదు

ప్రగాఢ నమ్మకంతో ఉన్నారని తెలిపారు. గత ఐదేళ్ల రాక్షస, తుగ్లక్ పాలనను అంతమొందించి, రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని మళ్లీ నిలబెట్టడంలో విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు పోషించిన పాత్ర ఎనలేనిదని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ప్రశంసించారు. అర్ధరాత్రి, పగలనక సోషల్ మీడియా వేదికగా, క్షేత్రస్థాయిలో పార్టీకి మద్దతుగా ఎన్ఆర్ఐలు చేసిన పోరాటం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ మహానాడు కార్యక్రమంలో అడిలైడ్ ఎన్ఆర్ఐ టీడీపీ నాయకులు, భారీ సంఖ్యలో తెలుగు కుటుంబాలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## షోకాజ్ నోటీసులివ్వండి

తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఆంధ్రా పేపర్ మిల్స్ యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలన్నారు. పర్యవేక్షణ సరిగా చేయని రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు కూడా నోటీసులు ఇవ్వాలని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను పవన్ ఆదేశించారు. గోదావరి పుష్కరాలు పరిశుభ్రమైన వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## దాడులు నిలిపివేస్తామంటూనే హెచ్చరించిన ఇరాన్

వెల్లడించింది. దేశ రక్షణ కోసం ఎటువంటి ముప్పును అయినా ఎదుర్కొంటామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. దౌత్యం, రక్షణ అనేవి జాతీయ శక్తికి రెండు రెక్కల వంటివని అన్నారు. యుద్ధరంగం నుంచి గానీ.. చర్చల నుంచి కానీ తాము వైదొలగలేదని వెల్లడించారు. ఇరాన్ విదేశాంగ మంత్రి మాట్లాడుతూ.. చాలా అనుమానాల మధ్య తమ అధికారులు అమెరికాతో శాంతి చర్చలు జరుపుతున్నారని.. లెబనాన్‌లో ఇజ్రాయెల్ అగ్రరాజ్యానికి తెలిసి జరిగినా తెలియకుండా జరిగినా వాటి వల్ల చర్చల ప్రక్రియకు అంతరాయం కలుగుతుందన్నారు. శాంతి ఒప్పందానికి దగ్గరగా ఉన్న సమయంలో ఈ దాడులు చేపట్టడం సరైన చర్య కాదన్నారు. ఇరాన్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ చేపట్టే ఏ చర్యకైనా అమెరికానే ప్రత్యక్ష బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాగా ఇరాన్‌లోని ఒక పెట్రోకెమికల్ ప్లాంట్ ఆ దేశం బాలిస్టిక్ క్షిపణులను తయారు చేయడానికి వినియోగిస్తోందని ఆరోపిస్తూ.. ఇజ్రాయెల్ ఆదివారం టెహ్రాన్‌లోని పెట్రోకెమికల్ ప్లాంట్‌పై దాడి చేసింది. దీనికి ప్రతీకారంగా ఇజ్రాయెల్‌లోని పెట్రోకెమికల్ ప్లాంట్‌పై ఐఆర్‌జీసీ దాడి చేసింది. దీంతో ట్రంప్ ఇరుదేశాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులు ఆపి..చర్చలకు రావాలని పిలుపునిచ్చారు.

## నేనేం చేశానో చర్చకు సిద్ధం

హైదరాబాద్‌లో లేకుండా చూసేందుకు నిపుణులతో కమిటీ వేశాం. మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో భవిష్యత్తు తరాలకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

**మరి మీరేం చేశారు?**

తెలంగాణ నుంచి 8 మంది భాజపా ఎంపీలను పంపిస్తే మోదీ ప్రధాని అయ్యారు. మరి ఆ ఎంపీలు తెలంగాణకు ఏం తీసుకొచ్చారు. రెండేళ్లలో ఏం చేయలేదని నన్ను అంటున్నారు.. మరి మీరేం చేశారు? నీటి పారుదల ప్రాజెక్టులకు నిధులు రాకుండా కిషన్‌రెడ్డి అడ్డుపుల్ల పెట్టారు. సబర్మతి, గంగా, యమున నదులను ప్రక్షాళన చేస్తే ఆహా ఓహో అన్నారు. మూసీ ప్రక్షాళనకు సహకరించమని భాజపా ఎంపీలు మోదీని అడిగారా?పదేళ్ల కేసీఆర్ పాలన, పన్నెండేళ్ల మోదీ పాలన, 30 నెలల మా పాలనపై చర్చకు సిద్ధం. ఎవరేం చేశారో.. ఎన్ని నిధులు తెచ్చారో చర్చిద్దాం రండి.

**మహా నగరంలో పేదలకు లక్ష ఇళ్లు**

విశ్వనగరం అని గొప్పలు చెప్పుకుంటే సరిపోదు అందుకు అనుగుణంగా అభివృద్ధి జరగాలి. అందుకే, మెట్రో రెండో దశ విస్తరణ చేపడుతున్నాం. గాజులరామారంలో వంద ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్‌ను నిర్మిస్తున్నాం. హైదరాబాద్‌లో లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ ఇళ్లను కట్టి పేదల కష్టాలు తీరుస్తాం. ఎక్కడ ఉన్న వారికి అక్కడే ఇళ్లు నిర్మించి ఇస్తాం. ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి విడిపించి అక్కడి పేదలకు ఇళ్లు నిర్మించేందుకు ప్రణాళికలు వేస్తున్నాం. రాబోయే 24 నెలలు అభివృద్ధిపైనే మా దృష్టి ఉంటుంది. రాజకీయాలకు అతీతంగా నగరాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలి"అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

## పశ్చిమాసియాలో మళ్లీ దాడులు

ఆర్థిక వ్యవస్థ, ఇంధన సరఫరాలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ ఉద్రిక్తతలను తక్షణమే ముగించాలని, పౌరులకు ఎలాంటి హాని కలగకుండా చూడాలని అన్ని పక్షాలను కోరుతున్నాం. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం లభించే దౌత్య పరిష్కారాల కోసం జరుగుతున్న చర్చలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలి" అని భారత విదేశాంగ శాఖపిలుపునిచ్చింది.

**కాల్పులు ఆపండి: ట్రంప్**


మరోవైపు, తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరాన్, ఇజ్రాయెల్ తక్షణమే పరస్పరం కాల్పులు ఆపాలని తన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడికి ప్రతీకారంగా ఇరాన్ ఆదివారం అర్ధరాత్రి నుంచి దాడులు మొదలుపెట్టింది. దీంతో ఇజ్రాయెల్ దీటుగా ప్రతిస్పందించింది.

## కూటి కోసమా? కోట్ల కోసమా?

### గల్లీ నుండి గ్లోబల్ దాకా మారిన చదువు!

ఒకప్పుడు గురుకులాల్లో జ్ఞానం అనేది ఒక పవిత్రమైన నదిలా ప్రవహించేది. నిశ్శబ్ద వాతావరణంలో, ప్రకృతి ఒడిలో శిష్యుడు గురువు నీడన ఉంటూ పాఠాలు మాత్రమే కాదు, జీవిత పాఠాలను, నైతిక విలువలను కూడా ఔపోసన పట్టేవాడు. అప్పట్లో విద్య అంటే ఆత్మశోధన, అంతులేని జ్ఞానసముపార్జన మాత్రమే! కానీ, నేడు కాల చక్రం తిరిగింది. విలువల స్థానంలో వ్యాపార సూత్రాలు వచ్చి చేరాయి. నాడు సరస్వతీ నిలయాలుగా వెలిగిన పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు. నేడు కార్పొరేట్ సామ్రాజ్యాలుగా, లాభాలు పిండుకునే ఫ్యాక్టరీలుగా రూపాంతరం చెందాయి. ఈ సరికొత్త విద్యా ప్రపంచంలో చదువు అనేది ఒక ఉత్పత్తి, విద్యార్థి ఒక వినియోగదారుడు, కన్న కలలను నిజం చేసుకోవాలని తపించే తల్లిదండ్రులు కేవలం కస్టమర్లు మాత్రమే! ఈ దయనీయమైన నయా వ్యాపార ధోరణి మన సమాజ ఆత్మను ఎలా నలిపేస్తోందో ఇప్పుడు లోతుగా, ఆత్మపరిశీలనతో ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో గత పదిహేను సంవత్సరాల విద్యా ముఖచిత్రాన్ని పరిశీలిస్తే ఒక చేదు నిజం మనకు స్పష్టంగా అర్థమవుతుంది. ఈ స్వల్ప కాలంలోనే ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల సంఖ్య ఏకంగా మూడు రెట్లు పెరిగింది. కానీ, మరోవైపు నిరుపేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వ పాఠశాలలు ఒక్కొక్కటిగా మూతపడుతున్నాయి. ఒకప్పుడు ఏ ఊరికెళ్లినా గర్వంగా, కళకళలాడుతూ కనిపించే జిల్లా పరిషత్తు బడులు నేడు శిథిలమైన గోడలతో, కిటికీలు లేని తరగతి గదులతో, ఖాళీ బెంచీలతో ఒంటరిగా నిద్రపోతున్నాయి. ఈ దుస్థితికి అసలు కారణం ఏమిటి? పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలు సైతం మారుతున్న కాలంతో పాటు పోటీ పడాలనే ఆశతో, ఆంగ్ల మాధ్యమం కోసం అప్పులు చేసైనా ప్రైవేట్ స్కూళ్ల వైపు అడుగులు వేయక తప్పడం లేదు.

కానీ, ఆ స్కూళ్లు వసూలు చేసే ఫీజులు మాత్రం మధ్యతరగతి గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తూ ఆకాశాన్ని అంటుతున్నాయి. మారుమూల పల్లెటూరిలో ఒక సామాన్య రైతు తన రెక్కల కష్టాన్ని నమ్ముకుని, ఎంతో కాలంగా సాగు చేసుకుంటున్న జీవనాధారమైన పొలాన్ని అమ్మి మరి కొడుకునో, కూతురినో నగరాల్లోని ఇంజినీరింగ్ కాలేజీల్లో చదివిస్తున్నాడంటే... ఆ చదువు కూటి కోసమా లేక కార్పొరేట్ శక్తులు ఆశించే కోట్ల కోసమా అని ప్రశ్నించక తప్పడం లేదు. మన విద్యావ్యవస్థ ఏ స్థాయిలో వ్యాపారీకరణ చెందిందో చెప్పడానికి ఈ గణాంకాలే ప్రత్యక్ష సాక్ష్యాలు.నేడు ఒక సామాన్య విద్యార్థి నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ పూర్తి చేయాలంటే సగటున రూ.8,00,000 పైమాటే చెల్లించాల్సి వస్తోంది. గత 15 ఏళ్లలోనే ప్రైవేట్ స్కూళ్ల సంఖ్య ఏకంగా 3 రెట్లు పెరిగిపోవడం విద్యా దోపిడీకి అద్దం పడుతోంది. ఇంత భారీ ఖర్చుల భారాన్ని మోయలేక 60% మంది విద్యార్థులు తమ చదువుల కోసం అప్పుల్లో కూరుకుపోతుంటే, మరోవైపు డిగ్రీలు పూర్తి చేసిన గ్రాడ్యుయేట్లలో 47% మందికి ఉద్యోగాలు రాకపోవడం గమనార్హం. చదువుల కోసం సర్వస్వం అమ్ముకుని, చేతిలో సర్టిఫికెట్ ఉన్నా ఉద్యోగం దొరకని ఈ దుస్థితి, నేటి విద్యా రంగంలో దాగి ఉన్న అసలైన సంక్షోభ సూచిక!ఒకప్పుడు విద్యారంగంలో వినపడని వింత పదాలు నేడు నిత్యకృత్యమైపోయాయి. డొనేషన్ , మేనేజ్‌మెంట్ సీట్ , కేపిటేషన్ ఫీ ఇవి ఇప్పుడు విద్యా మార్కెట్లో సర్వసాధారణ పదాలుగా చలామణి అవుతున్నాయి. ఒక మెడికల్ కాలేజీలో ఒక్కో సీటుకు రూ. 60 లక్షల నుండి ఏకంగా రూ. 80 లక్షల వరకూ బేరసారాలు సాగుతున్నాయి. ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రభుత్వం కేటాయించే ఫ్రీ సీట్ వచ్చిందని సంబరపడే లోపే హాస్టల్ ఫీజు, ఎయిర్ కండిషన్డ్ బస్ ట్రాన్స్‌పోర్ట్, స్పెషల్ యూనిఫాం, ప్రాజెక్ట్ పుస్తకాలు అంటూ అదనపు ఖర్చుల పేరిట లక్షల రూపాయల బిల్లు చేతిలో పెడుతున్నారు.ఇంత భారీ మొత్తంలో డబ్బు చెల్లించే ఆర్థిక శక్తి సమాజంలో ఎంతమందికి ఉంటుంది? లగ్జరీ కార్లలో వచ్చే వారికి ఇది చిన్న విషయమే కావచ్చు, కానీ రెక్కాడితే గాని డొక్కాడని పేద, మధ్యతరగతి విద్యార్థులు బ్యాంకు లోన్లు తీసుకుని, వడ్డీల భారంతో చదువు సాగిస్తున్నారు. పోనీ, అంత కష్టపడి చదువు పూర్తయ్యాక ఏవైనా ఉద్యోగాలు దొరుకుతున్నాయా అంటే అదీ లేదు. ఉద్యోగం దొరకకపోయినా, నెల తిరిగేసరికి బ్యాంకు లోన్ ఈఎంఐల రూపంలో ఋణం మాత్రం ఇంటి తలుపు తడుతూనే ఉంటుంది. ఇది కేవలం ఒక విద్యార్థి ఎదుర్కొంటున్న వ్యక్తిగత కష్టం కాదు.ఇది ఒక తరం మొత్తం అనుభవిస్తున్న సామూహిక సంకటం!ప్రస్తుత విద్యావ్యవస్థ విద్యార్థులకు సబ్జెక్టుపై లోతైన అవగాహనను, చదువుపై ఇష్టాన్ని నేర్పించడం ఎప్పుడో మానేసింది. వారి ఏకైక లక్ష్యం కేవలం పరీక్షలు పాస్ అవ్వడం, ర్యాంకులు సాధించడం మాత్రమే! దీనికోసం వీధి వీధికో **JEE, NEET, EAMCET** కోచింగ్ సెంటర్లు, జైళ్లలాంటి హాస్టళ్లు పుట్టుకొస్తున్నాయి. చైల్డ్‌హుడ్‌ని ఎంజాయ్ చేయాల్సిన పదో తరగతి వయసు నుండే పిల్లలు తెల్లవారుజామున ఐదు గంటల నుండి రాత్రి పది గంటల వరకు కోచింగ్ క్లాసుల ఒత్తిడిలో నలిగిపోతున్నారు. దీనివల్ల వారిలోని సహజసిద్ధమైన సృజనాత్మకత మొగ్గలోనే తుంచేయబడుతోంది.కళలు, సంగీతం, క్రీడలు, సాహిత్యం ఇవన్నీ నేటి కార్పొరేట్ సమాజంలో వేస్ట్ ఆఫ్ టైమ్ అనిపించుకుంటున్నాయి. ఒకానొకప్పుడు ఒక పిల్లాడు పల్లెటూరిలో చెట్టుపై కూర్చుని పట్టపగలు పక్షుల కిలకిలరావాలను, వాటి గూళ్లను గమనించేవాడు. ఆ కుతూహలమే, ఆ ప్రకృతి పరిశీలనే ప్రపంచానికి గొప్ప గొప్ప శాస్త్రవేత్తలను అందించింది. కానీ ఇప్పుడు, ఆ పిల్లాడికి నాలుగు గోడల మధ్య స్టడీ మెటీరియల్ ఇచ్చి, ర్యాంకుల రేసు గుర్రంలా పరిగెత్తేలా గదిలో బంధిస్తున్నారు.మన విద్యావ్యవస్థ పూర్తిగా ఒక కార్పొరేట్ వ్యాపారంగా మారడానికి వెనుక మరో అత్యంత బాధాకరమైన, చీకటి కోణం ఉంది.అదే ఉపాధ్యాయుల దయనీయ స్థితి! ప్రభుత్వ రంగంలో పనిచేసే ఉపాధ్యాయులకు కనీసం పెన్షన్, హక్కులు, ఉద్యోగ స్థిరత్వం ఉన్నాయి. కానీ, అత్యధిక శాతం ప్రైవేట్ స్కూళ్లలో అర్హత కలిగిన టీచర్లకు కూడా కనీస వేతనాలు అందడం లేదు. వారికి ఎలాంటి జాబ్ సెక్యూరిటీ ఉండదు, కనీస హక్కులు అడిగే ధైర్యం అస్సలుండదు. కేవలం అడ్మిషన్ల సీజన్ ఆధారంగా వారిని సీజనల్ కార్మికులుగా వాడుకుంటున్నారు.సమాజంలో ఒక గొప్ప ఉపాధ్యాయుడు తయారవ్వాలంటే, ఆ వ్యక్తి సమాజంలో గౌరవంగా, ఆత్మవిశ్వాసంతో బతకగలిగే వాతావరణం ఉండాలి. కానీ, నేటి ప్రైవేట్ విద్యావ్యవస్థలో ఉపాధ్యాయుడిని కేవలం సిలబస్ పూర్తి చేసే ఒక కంటెంట్ డెలివరీ సిస్టమ్ లేదా సేల్స్ మెన్‌గా మార్చేశారు. విద్యా వ్యవస్థలో ఇంతకంటే విషాదకరమైన పరిణామం మరొకటి ఉండదు.ఈ విద్యా సంక్షోభం నుండి మన సమాజాన్ని, భవిష్యత్తు తరాలను కాపాడుకోవడానికి తక్షణమే కొన్ని విప్లవాత్మక మార్పులు చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను డిజిటల్ క్లాస్‌రూమ్‌లతో పటిష్టం చేయాలి.ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టేందుకు ఫీజు నియంత్రణ చట్టాలను అత్యంత కఠినంగా అమలు చేయాలి. ప్రైవేట్ రంగానికి కనీస వేతన చట్టాన్ని వర్తింపజేస్తూ ఉపాధ్యాయ శిక్షణ, జీతాలు, వారి సామాజిక గౌరవాన్ని పెంచాలి. కేవలం సర్టిఫికెట్ల కోసం కాకుండా, ఉపాధిని ఇచ్చే నైపుణ్య అభివృద్ధిని ప్రాథమిక స్థాయి నుండి ప్రోత్సహించాలి. ప్రాథమిక విద్యలో మాతృభాష ప్రాధాన్యతను కాపాడుతూనే ఆంగ్ల పరిజ్ఞానాన్ని అందించాలి. విద్యా రంగంలో కార్పొరేట్ శక్తుల గుత్తాధిపత్యానికి, వారి నిర్వహణకు స్పష్టమైన పరిమితులు విధించాలి.తెలుగు సంస్కృతి, భారతీయ జీవన విధానం సదా విద్యను అత్యంత పవిత్రమైనదిగా, దైవసమానంగా భావించాయి. మన పెద్దలు ఊరికే అనలేదు, విద్యా దదాతి వినయంఅన్నారు. అంటే విద్య అనేది మనిషికి వినయాన్ని ఇస్తుంది, ఆ వినయం వల్ల పాత్రత (అర్హత) లభిస్తుంది, ఆ పాత్రత ద్వారానే నిజమైన సంపద, కీర్తి చేకూరుతాయి. ఇది మన పూర్వీకులు అనుభవపూర్వకంగా చెప్పిన సత్యం.కానీ నేడు ఆ సూత్రం పూర్తిగా తలకిందులైంది. ముందు నీ దగ్గర డబ్బు ఉంటేనే మంచి కార్పొరేట్ స్కూల్లో సీటు దొరుకుతుంది.అక్కడ చదివితేనే పెద్ద కాలేజీలో సీటు వస్తుంది.ఆ కాలేజీ ట్యాగ్ ఉంటేనే మల్టీనేషనల్ కంపెనీలో ఏసీ రూమ్ ఉద్యోగం వస్తుంది అనే చట్రంలో సమాజం ఇరుక్కుపోయింది. మరి ఈ ధన ప్రవాహ సర్కిల్‌లో రూపాయి లేని నిరుపేద, ప్రతిభావంతుడైన విద్యార్థికి ఎక్కడ చోటు ఉంది? ఆ పిల్లాడి కళ్లల్లో మెరిసే ఐఏఎస్, ఐపీఎస్ కలలు ఎప్పటికైనా నిజమవుతాయా? ఇది నేడు మన సమాజం తనను తాను ప్రశ్నించుకోవాల్సిన నైతిక ప్రశ్న!మనం లగ్జరీ లైఫ్‌లో బతుకుతూ ఎప్పుడైనా ఆలోచించామా ఒక మారుమూల తండాలో పుట్టిన నిరుపేద పిల్లవాడికి, ఒక అడవి గిరిజన గ్రామంలో సరైన దారి లేక నడుచుకుంటూ వెళ్లే అమ్మాయికి, రోజంతా ఎండలో శ్రమించే సామాన్య నిరుపేద రైతు కుమారునికి నేటి ఆధునిక, నాణ్యమైన విద్య సమానంగా అందుతోందా? విద్య అనేది కొనుక్కోగలిగే వస్తువు కాదు, అది ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు. సమాజంలో ప్రతి బిడ్డకూ సమాన విద్యను అందించడానికి తగినన్ని నిధులు కేటాయించడం ప్రజాస్వామ్య ప్రభుత్వాల కనీస బాధ్యత.కానీ విచారకరంగా, నేటికీ మన దేశంలో విద్యా రంగానికి కేటాయించే ప్రభుత్వ వ్యయం జీడీపీలో కేవలం 2 నుండి 3 శాతం మాత్రమే ఉంటోంది. ఇది యూనెస్కో అంతర్జాతీయంగా సూచించిన 6 శాతం కంటే చాలా తక్కువ. ఈ బడ్జెట్ అంతరాన్ని తగ్గించి, బడుగు బలహీన వర్గాలకు నాణ్యమైన విద్యను ఉచితంగా అందించాల్సిన బాధ్యత మన ప్రజాప్రతినిధులపై ఎంతైనా ఉంది.విద్య అనేది కేవలం రెండు పూటలా తిండి పెట్టే కూటి కోసం మాత్రమే కాదు.అది ఒక మనిషి యొక్క అంతరంగాన్ని, వ్యక్తిత్వాన్ని సమగ్రంగా నిర్మించే అద్భుతమైన ప్రక్రియ. కానీ, దురదృష్టవశాత్తూ అదే విద్య నేడు కోట్ల కోసమే అనే నినాదంతో ఒక క్రూరమైన వ్యాపారంగా మారినప్పుడు, మనం ఆధునిక యుగంలో ఉన్నామని, సమాజం ఎంతో అభివృద్ధి చెందిందని ఏ నోటితో చెప్పుకోగలం? ఒక మధ్యతరగతి తల్లి తన జీవితాంతం పొదుపు చేసిన డబ్బంతా పిల్లల స్కూల్ డొనేషన్లకు, ఫీజులకే హారతైపోతే, ఆ మధ్యతరగతి కుటుంబంలో రేపటి ఆనందం ఎలా మిగులుతుందా? ఒక పేద రైతు తన రక్తాన్ని కూడు చేసి, అప్పులు తెచ్చి పంపించిన పిల్లాడికి డిగ్రీలు వచ్చినా ఉద్యోగం రాకుంటే, ఆ గుండెల్లో నిండే నిరాశను ఏ సిలబస్ పుస్తకంలో రాసి పెట్టారు?కనుక, మన తెలుగు సమాజం ఇప్పుడు నిద్ర నుండి మేల్కొనాల్సిన సమయం వచ్చింది. అక్షరాన్ని అంగడి బొమ్మగా మార్చే ఏ శక్తినైనా మనం ఉపేక్షించకూడదు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి బలోపేతం చేయాలని పాలకులను గట్టిగా డిమాండ్ చేయాలి. ఫీజు నియంత్రణ చట్టాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయించాలి. మన సమాజ వికాసానికి మూలస్తంభాలైన ఉపాధ్యాయ వృత్తికి పూర్వ వైభవాన్ని, తగిన గౌరవాన్ని ఇవ్వాలి.మన పిల్లలకు కేవలం ప్రోగ్రామ్ చేసిన నంబర్లు, మార్కులు కాదు.అంతులేని జ్ఞానాన్ని ఇద్దాం. కేవలం గోడకు తగిలించుకునే సర్టిఫికెట్లు కాదు.సమాజంలో తలెత్తుకుని బతికే నైతిక వ్యక్తిత్వాన్ని ఇద్దాం. కోటి విద్యలు కూటి కోసమే కాదు కార్పొరేట్ల కోట్ల కోసమూ కాదు. విద్య అనేది మనిషిని నిజమైన కరుణ గల మానవుడిగా నిలబెట్టడం కోసం మాత్రమే! ఆ పవిత్రమైన స్ఫూర్తిని మన గుండెల్లో తిరిగి నింపుకుందాం. వ్యాపార రహిత పారదర్శక విద్యను మనమంతా కలిసికట్టుగా మళ్లీ నిర్మిద్దాం!



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# ఎడిటర్ వాయిస్

## మారిన అమరావతి స్వరూపం... 9 నగరాలు.. 9 జోన్లు..!

ఏపీ రాజధాని అమరావతి స్వరూపం మారిందా? నవ నగరాలతోపాటు.. 9 జోన్లను కూడా ఏర్పాటు చేస్తున్నారా ? తద్వారా పాలనను మరింత పారదర్శకంగా.. క్షేత్రస్థాయికి చేరువ చేయనున్నారా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. అమరావతి రాజధాని పరిపాలనలో మార్పులు చేస్తూ.. సీఆర్ డీఏ కమిషనర్ విజయరామరాజు నిర్ణయించారు. దీంతో రాజధాని ప్రాంతాన్ని గ్రిడ్లుగా మార్చి 9 జోన్లు ఏర్పాటు చేశారు. ఈ మేరకు విజయరామరాజు అధికారిక ఆదేశాలు జారీచేశారు.

ఇవన్నీ.. పరిపాలనా పరమైన సౌలభ్యం కోసం అధికారులను, సీఆర్డీఏలో ల్యాండ్ పూలింగు యూనిట్లను విభజిస్తూ సిసిఎల్ఏకు, గ్రామవార్డు సచివాలయ విభాగాలకు లేఖ రాశారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ఈ జోన్లను అమల్లోకి తీసుకురానున్నారు. దీని ప్రకారం.. ప్రస్తుత ప్రభుత్వ కార్యాలయాలు నిర్మిస్తున్న కొండమరాజుపాలెం రెవెన్యూను సెంట్రల్ జోన్ పరిధిలోకి తీసుకొచ్చారు. ఈస్ట్ జోన్ పరిధిలోకి కృష్ణాయపాలెం, పెనుమాక వచ్చాయి.

ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి ఐనవోలు, నార్త్ ఈస్ట్ జోన్లోకి లింగాయపాలెం, ఉండవల్లి, వెంకటపాలెం, నార్త్ ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి మల్కాపురం, ఉద్దండరాయునిపాలెం, వెలగపూడి, మందడం రెండు యూనిట్లు తీసుకొచ్చారు. నార్త్ వెస్ట్ జోన్ పరిధిలో అబ్బురాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, సౌత్ ఈస్ట్‌లోకి నవులూరు 1,2 యూనిట్లు, సౌత్ ఈస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి కురగల్లు రెండు యూనిట్లు, నిడమర్రు రెండు యూనిట్లు కలిపారు.

వెస్ట్ సెంట్రల్ జోన్ పరిధిలోకి నెక్కల్లు, నేలపాడు, శాఖమూరు, తుల్లూరు రెండు యూనిట్లు, అనంతవరం గ్రామాలను తీసుకొచ్చారు. అలాగే రెండోదశలో ప్రతి గ్రామాన్ని ఒక యూనిట్గా ఏర్పాటు చేయడంతోపాటు సిబ్బందిని నియమించారు. ఒక్కో యూనిట్‌కు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్, డిప్యూటీ తహశీల్దార్, వీఆర్‌ఓ, లైసెన్డ్ సర్వేయర్, విలేజ్ సర్వేయర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, డిజిటల్ అసిస్టెంట్లు నియమించారు. రాజధాని నగరంలో ల్యాండ్స్ విభాగానికి ప్రత్యేక యూనిట్‌ను ఏర్పాటు చేశారు.

ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో సమస్యల పరిష్కారం ఇబ్బందిగా మారింది. దీంతో జోన్ల వారీగా ఈ ప్రాంతాన్ని విభజించడంతో జోన్ల పరిధిలోకి వచ్చే సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాల్సి ఉంటుంది. భూ యజమానులు నేరుగా సిఆర్డిఏ కార్యాలయానికి వెళ్లకుండా ఆయా జోన్ల పరిధిలోని సమస్యలు పరిష్కరించుకునేలా ఏర్పాట్లు చేశారు. తద్వారా.. అమరావతి రైతులకు మరింత మేలు జరుగుతుందని సర్కారు భావిస్తోంది.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## బీహార్‌లో రోడ్డు ప్రమాదం.. ముగ్గురి ఏపీవాసుల మృతి

**సంగం, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లూరు జిల్లా సంగం నుంచి కాశీకి వెళ్తున్న యాత్రికుల బస్సు ఆదివారం అర్ధరాత్రి ప్రమాదానికి గురైంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా వాసులు వెళ్తున్న బస్సు బిహార్ రాష్ట్రం ఔరంగాబాద్ వద్దకు రాగానే రహదారి ప్రమాదానికి గురైంది. దీంతో ముగ్గురు జిల్లావాసులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ నెల 1న సంగం నుంచి 43 మంది యాత్రికులతో బస్సు బయల్దేరింది. ఆదివారం రాత్రి బిహార్ రాష్ట్రంలోని గయనుంచి వారణాసికి వెళ్లే క్రమంలో ఎన్‌హెచ్ 2 పై ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో బస్సులో ఎడమవైపు కూర్చొన్నవారిలో ముగ్గురు మృతి చెందారు. సంగం, ఆత్మకూరు ప్రాంతాలకు చెందిన సుమారు 15 మంది గాయపడగా వారిని అక్కడే దగ్గరలో ఉన్న వైద్యశాలకు చికిత్సకు తరలించారు. రాష్ట్రప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. ఈ ప్రమాదం జిల్లాలో తీవ్ర ఆందోళన కలిగించింది.

## తిరుపతమ్మ భక్తులపై కత్తులు, కర్రలతో దాడి

**బాపట్ల జిల్లాకు చెందిన ఐదుగురికి తీవ్ర గాయాలు – భక్తులపై కర్రలతో దాడి చేస్తున్న వ్యక్తులు**



**పెనుగంచిప్రోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని శ్రీతిరుపతమ్మ ఆలయానికి వచ్చిన భక్తులపై కొందరు స్థానికులు కత్తులు, కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. బాపట్ల జిల్లా కొల్లూరు గ్రామానికి చెందిన 20 మంది భక్తులు పెనుగంచిప్రోలులోని అమ్మవారి ఆలయానికి ఆదివారం వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నాక.. మున్నేరు ఆవలి వైపున వైఎస్ఆర్ మామిడితోటలో బస చేశారు. వీరు మొక్కు కోసం తెచ్చిన మేకపోతును కోసేందుకు స్థానికంగా ఉండే కొందరిని రూ.600 ఇస్తామని మాట్లాడుకున్నారు. కానీ.. కోసిన తర్వాత ఎక్కువ డబ్బులు కావాలని వారు గొడవ చేశారు. అంగీకరించకపోవడంతో వారంతా ఒక్కటై కర్రలు, కత్తులతో భక్తులపై దాడికి దిగారు. దీంతో మహిళలు, పిల్లలు, వృద్ధులు భయంతో వణికిపోయారు. పారిపోతుండగా.. వారి వెంటపడి మరీ దాడి చేశారు. ఈ ఘటనలో గూడపాటి ఆంజనేయులు, పోలంకి శ్రీనివాసరావు, శ్రీపతి నాగరాజులతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు పరిస్థితిని అదుపు చేసి, కొంతమందిని స్టేషన్‌కు తరలించారు. దాడి చేసిన వారిలో పెనుగంచిప్రోలుకు చెందిన ముంగి జంపన్న అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు ఫిర్యాదు చేసి వెళ్లిపోయారని, అందుకే కేసు నమోదు చేయలేదంటూ పోలీసులు చెబుతున్నారు.

## నేలకోట ఆవ వద్ద పెద్దపులి జాడ.. డ్రోన్ కెమెరాతో గుర్తింపు



**విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలో ఆరు రోజులుగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న పెద్దపులి జాడను అటవీ అధికారులు గుర్తించారు. నేలకోట ఆవ వద్ద పులి సంచరిస్తున్నట్టుగా గుర్తించారు. రామదుర్గం కొండపై ఆదివారం రాత్రి అడవి పందిపై పెద్దపులి దాడి చేసిన దృశ్యాలను డ్రోన్ కెమెరాలో నమోదు చేశారు. పులిని బంధించేందుకు రెస్క్యూ బృందాలు నేలకోట ఆవ వద్దకు చేరుకున్నాయి.

## మైదుకూరులో పట్ట పగలే రెచ్చిపోతున్న దొంగలు



**మైదకూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** నిన్న మహబూబ్నగర్లో దొంగతనం.. నేడు అదే వార్డులో శ్రీ నగరంలో తులసి ఇంటిలో దొంగతనం. చోరీకి పాల్పడుతున్న దొంగను పట్టుకుని గ్రామస్తులు దేశ శుద్ధి..పోలీసులకు అప్పగింత. మైదుకూరు మున్సిపాలిటీని టార్గెట్గా దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలు. అసలే ఎండాకాలం ఆరు బయట నిద్రిస్తున్న ప్రజలు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం. ఎటువంటి అనుమానం వచ్చిన పోలీసులకు సమాచారం అందించాలనుకున్న పోలీసులు. పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని నిఘా పెట్టి దొంగతనాలను అరికట్టాలంటూన్న ప్రజానీకం. దొంగతనం చేసిన దొంగే.. తనపై చెప్పిన వారిని దొంగలనీ పోలీసులకు చెప్పిన వైనం. లక్షల రూపాయలు వెచ్చించి సీసీ కెమెరా నిఘా వ్యవస్థను పటిష్టం చేసిన కూడా దొంగతనాలు మాత్రం ఆగడం లేదు. దొంగతనం చేసిన దొంగలను మాత్రం త్వరితగతిన చేదీస్తున్న మైదుకూరు పోలీసులు. బంగారం ధర పెరిగిన తరుణంలో ఈ దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలు. మైదుకూరు ప్రజానీకం సైతం అప్రమత్తంగా ఉండాలని అనుమానం వస్తే సమాచారం అందించాలనుకున్న మైదుకూరు పోలీసులు.

### పోక్సో కేసులో

## సాక్ష్యాలు బలంగా ఉంటే శిక్ష తప్పదు

**మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు**

**మద్రాస్, విశ్వం వాయిస్ న్యూస్ :** లైంగిక దాడుల నుంచి బాలల రక్షణ చట్టం (పోక్సో) కేసుల్లో అత్యంత కీలకమైన మైలురాయిగా నిలిచేలా మద్రాస్ హైకోర్టు ఒక సంచలన తీర్పును వెలువరించింది. బాధితురాలు, ఆమె తల్లిదండ్రులు కోర్టులో తమ వాంగ్మూలాన్ని మార్చుకుని విరుద్ధంగా వ్యవహరించినప్పటికీ (హాస్టైల్)శాస్త్రీయంగా లభించిన డీఎన్ఏ నివేదిక బలంగా ఉంటే నిందితుడికి శిక్ష విధించవచ్చని న్యాయస్థానం స్పష్టం చేసింది. సమాజంలో బాలలపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టడానికి, బాధితులకు న్యాయం చేకూర్చడానికి ఈ తీర్పు ఎంతో దోహదపడుతుంది. సాధారణంగా పోక్సో కేసులలో వివిధ రకాల ఒత్తిళ్లు,సామాజిక కారణాలు లేదా రాజీ ప్రయత్నాల వల్ల బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులు కోర్టు విచారణ సమయంలో తమ పూర్వపు సాక్ష్యాలను మార్చుకోవడం మారుతున్న కాలంలో ఒక సవాలుగా మారింది.ఇటువంటి పరిస్థితులలో కేవలం సాక్షుల మాటలపైనే ఆధారపడకుండా, నిష్పాక్షికమైన మరియు శాస్త్రీయమైన డీఎన్ఏ పరీక్షల నివేదికను ప్రాధాన్యత కలిగిన సాక్ష్యంగా పరిగణించవచ్చని ఉన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. నేర పరిశోధనలో అత్యాధునిక సాంకేతికత, వైజ్ఞానిక ఆధారాల ప్రాముఖ్యతను ఈ తీర్పు మరోసారి నిరూపించింది. భారత రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కును,చట్ట నిబంధనలను పరిరక్షించే క్రమంలో..నేరస్థులు సాంకేతిక లోపాలు లేదా సాక్షుల ఉపసంహరణను ఆసరాగా చేసుకుని చట్టం నుంచి తప్పించుకోలేరని కోర్టు స్పష్టం చేసింది.సాక్షులు తమ వైఖరిని మార్చుకున్నప్పటికీ, నేర స్థలంలో లభించిన శాస్త్రీయ ఆధారాలు నిందితుడి నేరాన్ని నిరూపిస్తే, వాటి ఆధారంగానే శిక్షను ఖరారు చేయవచ్చని పేర్కొంటూ న్యాయస్థానం చట్టబద్ధమైన న్యాయ సూత్రాలకు పెద్దపీట వేసింది.

## పింఛను కోసం హత్య.. భార్యకు జీవిత ఖైదు..

**ఇద్దరు పిల్లలకు మరణశిక్ష**

**కాప్రా, విశ్వం వాయిస్ న్యూస్ :** పింఛను డబ్బు కోసం వ్యక్తిని దారుణంగా హత్య చేసిన కేసులో న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. మృతుడి భార్యకు జీవిత ఖైదు, కుమారుడు, కుమార్తెకు మరణ శిక్ష విధిస్తూ మాల్కాజిగిరి జిల్లా కోర్టు తీర్పు ఇచ్చింది. వివరాల్లోకి వెళితే.. 2019 ఆగస్టులో విశ్రాంత రైల్వే ఉద్యోగి మారుతి సుతార్(70)ను పింఛను డబ్బు కోసం అతని భార్య, కుమారుడు, కుమార్తె కలిసి హత్య చేసి ముక్కలుగా నరికారు. అనంతరం ఆ శరీర భాగాలను ఆరు బకెట్లలో నిల్వచేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. సుదీర్ఘ వాదనల అనంతరం సోమవారం న్యాయస్థానం తీర్పు వెలువరించింది. మృతుడి భార్య గంగాబాయికి జీవిత ఖైదు, కుమారుడు, కుమార్తెకు ఉరి శిక్షను విధిస్తూ మల్కాజిగిరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బాలభాస్కర్‌రావు తీర్పు ఇచ్చారు.

## గోవా సముద్ర తీరంలో ఘోర ప్రమాదం

**పర్యాటక పడవ మునిగి 23 మంది మృతి**



**విశ్వం వాయిస్ న్యూస్ :** గోవా సముద్ర తీరంలో ఘోర ప్రమాదం జరిగింది. పర్యాటక పడవ మునిగి 23 మంది మృతి చెందారు. సామర్థ్యానికి మించి పర్యాటకులతో వెళ్లడమే ప్రమాదానికి కారణం. సముద్రంలో మునిగిపోయిన పడవ.. 40 మందిని సురక్షితంగా కాపాడిన రెస్క్యూ టీమ్స్.. ప్రమాద సమయంలో బోటులో ఉన్న పర్యాటకులు.. మరో 64 మంది అచూకీ గల్లంతు. గల్లంతైన వారి కోసం తీవ్రంగా శ్రమిస్తున్న సహాయక సిబ్బంది.. గోవా తీరంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

# సక్సెస్ వాయిస్

## నాన్న ప్రేమ శిఖరాన్నెక్కించింది



**పర్వతారోహణ అంటేనే సాహసం. అలాంటిది అడుగడుగునా సవాళ్లు, ప్రమాదాలు పొంచి ఉండే మార్గంలో వెళ్లాలంటే ఇంకెంత ధైర్యం కావాలి? అయినా ఆత్మవిశ్వాసంతో దక్షిణం వైపు నుంచి ఎవరెస్ట్‌ను అధిరోహిం చింది 16ఏళ్ల నిషా శశికుమార్. ఆ ఘనత సాధించిన అతి పిన్న వయస్కురాలిగా నిలిచింది. ఆమెను పలకరించగా...**

మాది చిత్తూరు జిల్లా. మా పూర్వికులు చెన్నైలో స్థిరపడ్డారు. నాన్న శశికుమార్ గంధం.. 'ఎలక్ట్రానిక్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎల్సినా)' అధ్యక్షుడు. నా తొలిగురువు ఆయనే. రెండేళ్ల క్రితం నాన్నతో కలిసి నేపాల్, ఉత్తరాఖండ్‌ల్లో ట్రెక్కింగ్‌కి వెళ్లా. శిఖరాల్ని ఎక్కేంత ధైర్యాన్నిచ్చింది ఈ ప్రయత్నమే. మొదట్లో భయమేసేది. తర్వాత అదే థ్రిల్‌గా మారింది. అందుకే 'సెవెన్ సమ్మిట్స్ ఛాలెంజ్'ను ప్రయత్నించాలనుకున్నా. నాన్నకు చెబితే... చిన్న వయసు వద్దని వారించారు. కానీ నేను పట్టుబట్టా. దీంతో ఇద్దరం 2024లో ఆఫ్రికాలోని ఓ శిఖరాన్ని ఎక్కడానికెళ్లాం. మంచుతుపాను కారణంగా వెనక్కి వచ్చేశాం. గత ఏప్రిల్‌లో రష్యాలోని ఎల్‌బ్రస్, జూన్‌లో ఆఫ్రికాలోని కిలిమంజారో ఎక్కేశాం. దాంతో నాన్నకు నా మీద నమ్మకం వచ్చింది. ఇంకేం, ఆస్ట్రేలియాలోని కోసియస్కో, ఇండోనేషియాలోని కార్స్‌టెన్జ్ పిరమిడ్, అర్జెంటీనాలోని అకోన్‌కాగ్వా అధిరోహించేశా. ఇప్పుడు ఆసియాలోనే ఎత్తైన ఎవరెస్ట్‌ను ఎక్కా.

**ఆయన్ని చూసి ఏడ్చేశా**

ఎవరెస్ట్ ఎక్కేటప్పుడు నాన్నకు శ్వాస ఆడక 7వేల మీటర్ల ఎత్తులోని క్యాంప్–3 దగ్గరే ఆగిపోయారు. 'నా అవకాశం పోయింది. కానీ నువ్వు గెలవొచ్చు. నేను నిన్ను ప్రపంచంలోనే ఉన్నత వ్యక్తిగా చూడాలి అనుకుంటున్నా' అంటూ ప్రోత్సహించారు. అది విని ఏడ్చేశా. కానీ ఆ మాటలు గుర్తుపెట్టుకుంటూ శిఖరం అంచుకు చేరా. అక్కడా భావోద్వేగాన్ని ఆపుకోలేక ఏడ్చా. రెండేళ్ల క్రితమే నాకెంతో ఇష్టమైన తాతయ్య చనిపోయారు. ఆయనా నాకు మార్గదర్శే. నాన్ననీ తాతయ్యనీ ఆ క్షణం గుర్తుచేసుకున్నా. జాతీయ జెండానీ ఎగరేశా. ఇప్పటికి 5 ఖండాలు పూర్తయ్యాయి. ఈ ఏడాది నవంబర్‌కు 7 ఖండాల్లోని శిఖరాలు పూర్తిచేయాలని లక్ష్యం. అప్పుడు ప్రపంచంలోనే సెవెన్ సమ్మిట్స్ ఛాలెంజ్‌ని పూర్తిచేసిన పిన్న వయస్కురాలిగా నిలుస్తా. ఇప్పుడు నార్త్ అమెరికాలోని మౌంట్ దెనాలీకి వెళ్తున్నా. 18ఏళ్లలోపు వాళ్లలో ఎవరెస్ట్ తర్వాత వెంటనే దెనాలీ అధిరోహించినవాళ్లు లేరు. ఆ రికార్డు కోసమూ చూస్తున్నా. నా 15వ ఏటే ఇండోనేషియాలోని కార్స్‌టెన్జ్ పిరమిడ్‌ను అధిరోహించి ఇండియా బుక్ ఆఫ్ రికార్డుల్లో నిలిచా.

**ఆటలు, పుస్తకం**

సాహసాలు చేయాలంటే మానసిక బలంతోపాటు సరైన ప్రణాళికా ఉండాలి. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉండటం, సరైన శిక్షణా అవసరమే. వీటితోపాటు గట్టి సంకల్పం ఉన్న ఎవరైనా శిఖరాలు అధిరోహించొచ్చు. అయితే ఆ సమయంలో భావోద్వేగాలకు లోనవ్వడం, శారీరక సమస్యలూ వస్తుంటాయి. ఎవరెస్ట్ శిఖరం ఎక్కేటప్పుడు క్యాంప్–3, 4, ఆ తర్వాత సమ్మిట్ ముగింపు ప్రక్రియలు చాలా కఠినంగా తోచాయి. విపరీతమైన చలి, గాలులు, ఆక్సిజన్ తగ్గిపోవడం, శ్వాస సరిగా ఆడేది కాదు. క్యాంప్ 4ని డెత్‌జోన్‌గా చెప్పొచ్చు. షెర్పా సాయంతో అడ్డంకులన్నీ దాటి ముందుకు సాగా. నాకు బాస్కెట్‌బాల్, కరాటేల్లోనూ ప్రావీణ్యం ఉంది. 'పాలసీ రీఫార్మ్స్ టు క్లైంబ్ మౌంట్ ఎవరెస్ట్' అనే పుస్తకాన్ని రాశా. స్పోర్ట్స్ సైకాలజీతోపాటు బిజినెస్ స్టడీస్ చేయాలనుంది.

**బిజాపూర్ హిదాయతుల్లా, చెన్నై**

## 52 ఏళ్ల వయసులో సీఏ డిగ్రీ




**అత్యంత కష్టమైన కోర్సుల్లో సీఏనీ ఒకదానిగా చెబుతారు. వరుసగా చదువుతూ వస్తున్నవాళ్లకే కష్టమిది. కొన్ని దశాబ్దాలు చదువు పక్కనపెట్టిన వాళ్లకి ఇంకెంత కష్టమో ఆలోచించండి. అయినా పట్టుబట్టి చదివారు అనితా కాపడీ. దాని వెనక బలమైన కారణమూ ఉంది.**

తండ్రి 75వ పుట్టినరోజు! ఆయనకు అరుదైన బహుమతి ఇవ్వాలి అనుకున్నారు అనిత. తండ్రి కంపెనీ సెక్రటరీగా చేశారు. దీంతో సీఏ చేసి, డిగ్రీ ఆయన చేతిలో పెట్టాలనుకున్నారు. కానీ అది అనుకున్నంత సులువు కాలేదామెకి. అనితది గుజరాత్. ఎంకాం, ఎల్ఎల్‌బీ, బీఈడీ పూర్తిచేశారు. ఆపై 23ఏళ్లపాటు టీచర్‌గా పనిచేశారు. 48 ఏళ్ల వయసులో సీఏ చేయాలనుకున్నారు. ఉద్యోగానికి రాజీనామా చేసి, పుస్తకం చేతబట్టారు. మేథ్స్, అకౌంటెన్సీలపై ఆసక్తి ఎక్కువే. దీంతో 2012లో సీఏకి దరఖాస్తు చేసుకున్నారు. కోచింగ్ లేకుండానే ఛార్టర్డ్ అకౌంటెంట్‌లో రెండో ఫౌండేషనల్ స్టేజ్... ఐపీసీసీ పూర్తిచేశారు. తరవాతే సమస్యలు మొదలు. ఇంటి బాధ్యతలకు తోడు కూతురికి పెళ్లి కుదిరింది. ఆ పనులు సరిపోనట్లు కొడుకుకేమో బోర్డ్ ఎగ్జామ్స్. అన్నీ చక్కబెట్టుకుంటూనే కష్టంగా పరీక్షలకు సిద్ధమయ్యారు. ఇంకో పదిరోజుల్లో పరీక్షలనగా అత్తగారు చనిపోయారు. ఆ బాధ, బాధ్యతలు అన్నింటినీ సమన్వయం చేసుకుంటూనే సీఏ ఫైనల్ పరీక్షలు రాశారు. 52ఏళ్ల వయసులో అనుకున్నట్టుగా పట్టా పొందారు. నాన్నకి బహుమతిగా ఇచ్చారు. ఏడాదిన్నరపాటు అసిస్టెంట్ మేనేజర్‌గా, మరో ఏడాది ఇన్‌డైరెక్ట్ టాక్సేషన్- ఎగ్జిక్యూటివ్‌గా చేశారు. సీఏగా ప్రాక్టీసు మొదలుపెట్టారు. ఏదైనా సాధించడానికి వయసు ఎప్పుడూ అడ్డంకి కాదు. కష్టపడే తత్వం, సాధించాలన్న తపన ఉంటే ఎవరైనా ఎప్పుడైనా కలల్ని నిజం చేసుకోవచ్చు అంటారు అనిత. ఈమె కథ సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. 'మీరు మాకు స్ఫూర్తి' అంటూ ఆమెని ఎంతోమంది పొగుడుతున్నారు కూడా!

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

మంగళవారం, 09 జూన్, 2026

4

www.viswamvoice.com


'విశ్వంవాయిస్ కథనం'తో కదిలిన విద్యుత్ శాఖ

# రాయవరానికి ప్రత్యేక ఫీడర్ ప్రక్రియ ప్రారంభానికి హామీ

## రెండు రోజుల్లో చర్యలు చేపడతామని ఏఈ శ్రీనివాసులు వెల్లడి





**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాయవరం మండల కేంద్రంలో దళితవాడ సహా పలు ప్రాంతాలు అంధకారంలో మగ్గుతున్న పరిస్థితిపై "విశ్వంవాయిస్" ప్రచురించిన ప్రత్యేక కథనం ప్రభావం చూపింది. గ్రామ ప్రజల ఇబ్బందులు, విద్యుత్ శాఖ నిర్లక్ష్యంపై వెలువడిన వార్తకు స్పందించిన అధికారులు సమస్య పరిష్కారంపై దృష్టి సారించారు. మండల కేంద్రమైన రాయవరానికి ప్రత్యేక ఫీడర్ ద్వారా విద్యుత్ సరఫరా అందించాలన్న ప్రజల డిమాండ్‌పై విద్యుత్ శాఖ అధికారులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సోమవారం రాయవరంలో ఇందిరా కాలనీ సమీపంలో రాయవరంలో ఇందిరా కాలనీ సమీపంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి, తీగలు ప్రమాదకరంగా కిందికి వేలాడుతూ ఉండటంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏఈ సందాక శ్రీనివాసులు సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని మరమ్మతు పనులు పర్యవేక్షించారు. ప్రమాదకరంగా వేలాడుతున్న తీగలను సరిచేసి, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న వెదురుపాక, వెదురుపాక సావరం ఫీడర్ సమస్యల కారణంగా తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని అంగీకరించారు. రాయవరం మండల కేంద్రానికి ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేసే ప్రక్రియను రెండు రోజుల్లో ప్రారంభిస్తామని ఆయన హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన సాంకేతిక, పరిపాలనా అంశాలపై ఉన్నతాధికారులతో ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. ఇందిరా కాలనీ, మఠం వీధి, వంటి ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను "విశ్వంవాయిస్" వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు స్పందించడం పట్ల గ్రామస్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. "ప్రజా సమస్యలను మీడియాలో ప్రస్తావిస్తే అధికారులు స్పందిస్తారు" అంటూ స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రకటించిన హామీ అమలుచేసి, రాయవరం ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



అంధకారంలో

దళితవాడ సహా పలు ప్రాంతాలు

రాయవరంలో గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం

మండుతున్న వేసవిలో ప్రజల అవస్థలు

రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ : ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు చేయాలంటూ గ్రామస్థుల డిమాండ్ తూర్పుగోదావరి జిల్లా రాయవరం మండల కేంద్రంలో ఆదివారం రాత్రి తీవ్ర విద్యుత్ అంతరాయం ప్రజలను ఇబ్బందులకు గురిచేసింది. మండుతున్న వేసవి వేడిలో చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడగా, దళితవాడ, మఠం వీధి సహా పలు ప్రాంతాలు గంటల తరబడి అంధకారంలో మగ్గాయి. గ్రామంలోని ప్రధాన రహదారి పరిసరాల్లో మాత్రం విద్యుత్ సరఫరా కొంతవరకు కొనసాగుతుండగా, పేద ప్రజలు నివసించే ప్రాంతాల్లో మాత్రమే సరఫరా నిలిచిపోవడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "గ్రామం ఒక వైపు వెలుగుల్లో ఉండగా, మరో వైపు ప్రజలు చీకట్లో ఉండటం బాధాకరం" అని గ్రామస్తులు వాపోయారు. విద్యుత్ శాఖ అధికారులను ప్రశ్నించగా, రామచంద్రపురం నుంచి సరఫరా అందించే లైన్ తెగిపోవడంతో సమస్య ఏర్పడిందని, మరమ్మతులు పూర్తి చేసి విద్యుత్ పునరుద్ధరించడానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. అయితే గ్రామస్తులు మాత్రం ఈ సమాధానంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్య తలెత్తిన ప్రతిసారీ దళితవాడ వంటి ప్రాంతాలకే ఎక్కువగా విద్యుత్ కోతలు పడుతున్నాయని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రాయవరం గ్రామంలోని కొన్ని ప్రాంతాలు వెదురుపాక, వెదురుపాక సావరం వంటి గ్రామాలతో కలిపి ఏర్పాటు చేసిన ఫీడర్ పరిధిలో ఉండటంతో తరచూ అంతరాయాలు ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మండల కేంద్రంగా ఉన్న రాయవరానికి ప్రత్యేక విద్యుత్ ఫీడర్ ఏర్పాటు చేస్తే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అభిప్రాయపడుతున్నారు. "మండల కేంద్రానికి తగిన మౌలిక సదుపాయాలు ఉండాలి. తరచూ కరెంటు కోతలతో ప్రజలు ఇబ్బందులు పడటం సరికాదు. దళితవాడలను నిర్లక్ష్యం చేస్తున్న భావన కలుగుతోంది" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, దెబ్బతిన్న లైన్ల మరమ్మతులు వేగవంతం చేయడంతో పాటు రాయవరానికి ప్రత్యేక ఫీడర్ మంజూరు చేసి భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అలసిపోయి బహిరంగ ప్రాంతంలోనే నిద్రపోతున్న దళిత కాలనీవాసులు

> మండల కేంద్రమైన రాయవరానికి ప్రత్యేక ఫీడర్ అవసరంపై ఉన్నతాధికారులతో చర్చించాము. రెండు రోజుల్లో ప్రత్యేక ఫీడర్ ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాము. ప్రజలకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ శాఖ కట్టుబడి ఉంది.
>
> 
>
> **సందాక శ్రీనివాసులు**
> **విద్యుత్ శాఖ ఏఈ, రాయవరం**

కూలిన చెట్టు తరలింపుపై

# జిల్లా ఉప విద్యాశాఖ అధికారి ఆగ్రహం

## పాఠశాల ప్రధానోపాధ్యాయులకు వివరణ ఇవ్వాలని ఆదేశాలు



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం ప్రభుత్వ హైస్కూల్ ప్రాంగణంలో కూలిపోయిన భారీ వృక్షాన్ని అధికారులకు సమాచారం ఇవ్వకుండా ముక్కలుగా చేసి తరలించే ప్రయత్నం వివాదానికి దారితీసిన నేపథ్యంలో మండల విద్యాశాఖాధికారి, రామచంద్రపురం డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి రామలక్ష్మణ మూర్తి స్పందించారు. ఈ ఘటనపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన ఆయన చెట్టు కూలిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురాకుండానే చర్యలు చేపట్టడంపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రభుత్వ ఆస్తికి సంబంధించిన అంశంలో నియమ నిబంధనలు పాటించకుండా వ్యవహరించడం ఎందుకని ప్రశ్నిస్తూ పాఠశాల హెడ్మాస్టర్‌కు వివరణ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసారు. సాధారణంగా ప్రభుత్వ పాఠశాల ఆవరణలో చెట్లు కూలిన సందర్భంలో సంబంధిత అధికారులకు సమాచారం అందించి, పంచనామా నిర్వహించి, తదుపరి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియను పక్కనపెట్టి చెట్టు ముక్కలను తరలించే ప్రయత్నం జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరించి అవసరమైతే తదుపరి చర్యలు తీసుకుంటామని విద్యాశాఖ వర్గాలు తెలిపినట్లు సమాచారం. కాగా ప్రభుత్వ ఆస్తుల విషయంలో పారదర్శకత పాటించాలని స్థానికులు కోరుతున్నారు.

# ప్రైవేట్ స్కూళ్లలో వాణిజ్య విక్రయాలపై తనిఖీలు జరపాలి

## ధరల ప్రదర్శన బోర్డు ఏర్పాటు చేయాలని డివైఈవో ఆదేశం



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం మండలంలోని ప్రైవేట్ పాఠశాలలు విద్యా చట్టాలను ఉల్లంఘిస్తూ పుస్తకాలు, యూనిఫాం వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నాయంటూ సోమవారం మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో డివైఈఓ రామలక్ష్మణ మూర్తికి గ్రామ యువ నాయకులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిర్యాదు చేశారు. మండలంలోని పలు ప్రైవేట్ స్కూళ్లు పుస్తకాలు, నోట్‌బుక్కులపై ఎంఆర్‌పీ ముద్రించకుండా ఏకపక్షంగా ధరలు నిర్ణయించి వసూలు చేస్తున్నారని, స్కూల్ పేరుతో బ్యాగులు, బెల్టులు, డైరీలను బలవంతంగా కొనిపిస్తున్నారని ఆరోపించారు. వేలాది రూపాయలు వసూలు చేసినా జీఎస్టీ బిల్లులు ఇవ్వడం లేదని, తల్లిదండ్రులు ప్రశ్నిస్తే పిల్లలను మానసికంగా ఇబ్బంది పెడతారనే భయంతో బాధితులు బయటకు చెప్పలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదును స్వీకరించిన డివైఈవో రామలక్ష్మణ మూర్తి స్పందిస్తూ ప్రైవేట్ స్కూళ్ల కరస్పాండెంట్స్, ప్రిన్సిపల్స్ వాట్సప్ గ్రూపులో మెసేజ్ పెడుతూ, "మీరు వసూలు చేస్తున్న అన్ని రుసుములు, పుస్తకాలు, ఇతర వస్తువుల ధరలను తప్పనిసరిగా నోటీస్ బోర్డ్‌లో ప్రదర్శించాలి" అని ఆదేశించారు. బాధిత తల్లిదండ్రులు, విద్యార్థుల పేర్లను గోప్యంగా ఉంచి మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని రామకృష్ణారెడ్డి విజ్ఞప్తి చేసారు.

# గీత కార్మికుల సంప్రదాయ వృత్తిని పరిరక్షించాలి

## నీరా పరిశ్రమ అభివృద్ధి, ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలి - జిల్లా కలెక్టరేట్‌లో బీజేపీ వినతి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ నిర్వహిస్తున్న "జనతా వారధి" కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గీత కులాల స్థితిగతులపై అధ్యయనం నిర్వహించి, గీత కులాల సంఘాలు, సొసైటీలు, పెద్దలు, మేధావులు, వృత్తిదారులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వచ్చిన సూచనలు, అభిప్రాయాలను సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో వినతిపత్రం సమర్పించారు. జనతా వారధి జిల్లా కన్వీనర్ ఎమ్మెస్సార్‌కే రాజు మాట్లాడుతూ,గీత కార్మికుల సంప్రదాయ వృత్తిని పరిరక్షిస్తూ, నీరా పరిశ్రమ అభివృద్ధికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలని, నీరా ఆధారిత ఉత్పత్తులకు మార్కెటింగ్, బ్రాండింగ్, ప్రోత్సాహకాలు కల్పించాలని కోరారు. అలాగే తాడి చెట్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ, ఆంధ్రప్రదేశ్ సముద్రతీర ప్రాంతాల్లో పర్యావరణహిత "పామ్ గ్రీన్ వాల్" ప్రాజెక్టును అమలు చేయాలని, పరిశ్రమలు, కర్మాగారాలను ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం చేయాలని విజ్ఞప్తి చేశారు. తాటి ఆధారిత బయోడీజిల్, హార్టికల్చర్, ఆయుష్, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల స్థాపనకు ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించి గీత కులాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అలాగే గీత కులాల ఆది పురుషుడిగా భావించే కౌండిన్య మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించి రాష్ట్రస్థాయి గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్ బండి సత్యప్రసాద్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాలేపు సత్యసాయిరాం, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌వీబీఎన్ ఆచారి, కల్లు గీత కార్మిక సంఘ నాయకులు కె. గోవిందు, అంగర గనిరాజు, అత్తిలి పోశేశ్వరరావు, సిధాని వెంకట్, పోలవరపు రాము తదితరులు పాల్గొన్నారు.

# తేజస్విని అకాల మరణం బాధాకరం

## - రామకృష్ణ కుటుంబాన్ని ఓదార్చిన కుడుపూడి సత్తిబాబు




**కొవ్వూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** కొవ్వూరు నియోజకవర్గం, చాగల్లు గ్రామం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దొంగ రామకృష్ణ సతీమణి స్వర్గీయ తేజస్విని అకాల మరణం పట్ల రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం వారి స్వగృహానికి వెళ్లిన సత్తిబాబు , రామకృష్ణ ను వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని కోరుకుంటూ, తేజస్విని ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

# రాజ్యసభ అభ్యర్థులకు వేగుళ్ళ లీలాకృష్ణ సత్కారం



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ కార్యాలయంలో రాజ్యసభ ఎన్నికల నామినేషన్ పత్రాలు దాఖలు చేసిన అభ్యర్థులు సానా సతీష్, చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణ ను రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. సోమవారం జనసేన పార్టీ శాసన సభ కార్యాలయంలో రాజ్యసభ అభ్యర్థులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. ఈ సందర్భంగా లీలాకృష్ణ మాట్లాడుతూ రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపిక కావడం వారి దీర్ఘకాల రాజకీయ అనుభవం, పార్టీ పట్ల అంకితభావం, ప్రజాసేవ పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి వారు చేసిన కృషికి గుర్తింపుగానే ఈ అవకాశం లభించిందని అన్నారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలను జాతీయ స్థాయిలో సమర్థవంతంగా ప్రతినిధ్యం వహిస్తూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సంక్షేమం కోసం మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.ప్రజల ఆశయాలను పార్లమెంట్ వేదికగా బలంగా వినిపిస్తూ రాష్ట్రానికి మరిన్ని అవకాశాలు, వనరులు తీసుకురావడంలో వారు కీలక పాత్ర పోషిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రజాసేవలో మరిన్ని విజయాలు అందుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

# ఇండోర్ స్టేడియం శంకుస్థాపనకు కమిషనర్‌తో భేటి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, కూటమి నాయకులు నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనాను సోమవారం కలిసి నగర అభివృద్ధి పనులు, పెండింగ్ ప్రాజెక్టుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తారకరామ నగర్ ప్రాంతంలో చాలాకాలంగా కొనసాగుతున్న ప్రధాన డ్రైనేజీ సమస్యపై విస్తృతంగా చర్చించారు. ఆయా ప్రాంతాల్లో నిర్మించాల్సిన మేజర్ డ్రైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు సంబంధిత శాఖల మధ్య సమన్వయం అవసరమని సూచించారు. ముఖ్యంగా నేషనల్ హైవే అథారిటీ, ఓఎన్‌జీసీ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పరస్పర సహకారంతో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని నగరంలో చేపట్టాల్సిన మౌలిక వసతుల అభివృద్ధి పనులు, వాటి ఆర్థిక ఆమోదాలు, నిధుల కేటాయింపులు, అమలు ప్రగతిపై కమిషనర్‌తో సమీక్షించారు. పుష్కరాలకు ముందుగానే అవసరమైన పనులను పూర్తి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 10వ తేదీన వీఎల్‌పురం ఇండోర్ స్టేడియం శంకుస్థాపన కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లపై కూడా చర్చించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నగరాభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై సమన్వయంతో ముందుకు సాగాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా నాయకులు అధికారులను కోరారు.

సేవా భూషణ్ పురస్కారంతో

# డాక్టర్ దండు బోయిన సుజాతకు ఘన సత్కారం




**కడియం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ వేదికగా చైతన్య పౌరసత్వ పరిషత్ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రకాష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, యూనివర్సిటీ చైర్మన్ సత్యనారాయణ రాజు, ఆచార్య పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ రిజిస్టర్ మసగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు అంకితమైన ఈ మహాసభల్లో సామాజిక, సాహిత్య, సేవా రంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న కడియం మండలం బుర్రిలంక గ్రామానికి చెందిన డాక్టర్ దండు బోయిన సుజాతకు ప్రతిష్టాత్మక "సేవా భూషణ్" పురస్కారాన్ని ప్రదానం చేసి, ఆమెను ఘనంగా సత్కరించారు. ఆచార్య పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం స్వర్ణ పతక గ్రహీత అయిన డాక్టర్ సుజాత వివిధ రంగాల్లో అందించిన విశేష సేవలను గుర్తిస్తూ ఈ గౌరవాన్ని అందజేశారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు.డాక్టర్ సుజాతకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారం లభించడం పట్ల బుర్రిలంక గ్రామ ప్రజలు, సాహితీ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాకాంక్ష పత్రిక ఎడిటర్ పి కృష్ణ, కేతా శ్రీనివాసరావు, యూనివర్సిటీ ప్రతినిధులు, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో

# యోగాంధ్ర శిక్షణా తరగతులు




**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్ర2026 ప్రచార కార్యక్రమంలో భాగంగా మండపేట పురపాలక సంఘ కార్యాలయంలో సోమవారం యోగ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఉదయం 6:30 గంటలకు కమీషనర్ టి వి రంగారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండపేటకు చెందిన యోగ గురువు కేదారశెట్టి శ్రీను యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. మున్సిపల్ సిబ్బంది, స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొని యోగాసనాలు సాధన చేశారు.జూన్ 7 నుండి 20 వరకు సామూహిక యోగా సాధన, అవగాహన కార్యక్రమాల ద్వారా ఆరోగ్యవంతమైన ఆంధ్ర ప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే యోగాంధ్ర-2026 లక్ష్యమని కమీషనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యుటివ్ ఇంజనీర్ కె. శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎం సత్తిరాజు, మున్సిపల్ మేనేజర్ వి. శ్రీనివాసరావు, స్వర్ణ వార్డు సచివాలయ మేనేజర్ దంటు శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె శ్రీరమ్య ఆర్ ఓ మాచిరాజు రవి, ఆర్ ఐ కొత్తపల్లి సత్తిబాబు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ద్వారపూడిలో బీజేపీ మండల స్థాయి సమావేశం



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట మండలం ద్వారపూడి గ్రామంలోని రజక కమ్యూనిటీ హాల్‌లో భారతీయ జనతా పార్టీ మండల స్థాయి సమావేశం జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షులు ఆడబాల సత్యనారాయణ పర్యవేక్షణలో జరిగిన ఈ సమావేశానికి మండల బీజేపీ అధ్యక్షులు పాలిక రమణ అధ్యక్షత వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన బి ఎల్ ఏ కే వి వి సాయిరాం మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' సర్ ప్రక్రియపై ప్రతి కార్యకర్తకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. పశ్చిమ బెంగాల్, బీహార్‌లో గతంలో ఓటర్ల జాబితా సవరణల సమయంలో జరిగిన రాజకీయ రచ్చను గుర్తుచేస్తూ, ఓట్ల నమోదు,తొలగింపు ఎంత కీలకమో వివరించారు. ప్రతి పోలింగ్ బూత్‌కు ఒకరు చొప్పున బి ఎల్ ఏ 2 ల నియామకం తప్పనిసరి అని సాయిరాం స్పష్టం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా సర్ ప్రక్రియను బి ఎల్ ఏ 1 గా తాను సమన్వయం చేస్తానని తెలిపారు.బూత్ స్థాయి ఏజెంట్లు ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలిస్తూ పార్టీ శ్రేణులను క్రియాశీలం చేయాలని పిలుపునిచ్చారు.పార్టీని క్షేత్రస్థాయి నుంచి శక్తివంతం చేసేందుకు కార్యకర్తలు నిరంతరం ప్రజల్లో ఉండాలని సాయిరాం కోరారు. బూత్ కమిటీలను పటిష్టం చేయడం ద్వారానే పార్టీ బలపడుతుందని, ప్రతి బూత్‌లో పార్టీ ఉనికిని చాటేలా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.మండల బీజేపీ అధ్యక్షులు పాలిక రమణ మాట్లాడుతూ,బాధ్యతలు, గ్రామ స్థాయి కమిటీల బలోపేతంపై దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ రాయి వీర్రాజు, నీల సత్యనారాయణ, బుద్ధవరపు రాజు, ముత్యం దేవర మణికంఠ సాయి, గెలకంశెట్టి కుమార్, టేకి వీర వెంకట సత్యనారాయణ, గుత్తుల సత్యనారాయణ, దూలం శ్రీనివాస్, ఇందుకూరి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద విద్యార్థులను నేను చదివిస్తా..

## విద్యార్థినుల కెరీర్ గైడెన్స్ సమావేశంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ



**కే.గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు నూతన కోర్సులను ఎంపిక చేసుకుని తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. కే.గంగవరం మండలం మెరకపాలెం మరియు పరిసర గ్రామాల్లో పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలను ప్రోత్సహిస్తూ స్థానిక నాయకుడు కాటే సుబ్రహ్మణ్యం అధ్యక్షతన నిర్వహించిన కెరీర్ గైడెన్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదో తరగతి అనంతరం మంచి ఉపాధి అవకాశాలు కల్పించే వొకేషనల్ కోర్సులను అభ్యసించడం ద్వారా జీవితంలో త్వరగా స్థిరపడే అవకాశం ఉంటుందని సూచించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందని వెల్లడించారు."గివ్ బ్యాక్ టు సొసైటీ" అనే నినాదంతో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా వెనుకబడిన వర్గాల పిల్లలకు విద్యా సహాయం అందిస్తున్నామని, ఇప్పటివరకు తల్లిదండ్రులు లేని 130 మంది పిల్లలను దత్తత తీసుకుని వారి పూర్తి విద్యాభ్యాస బాధ్యతలను నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. పేదరికం కారణంగా ఏ ఒక్క విద్యార్థి చదువు మధ్యలో ఆగిపోకూడదనే ఆశయంతో నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు తానే స్వయంగా అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం నూతన పరిశ్రమలు, పెట్టుబడులను తీసుకువచ్చి సుమారు 23 లక్షల ఉద్యోగాల కల్పనకు చర్యలు చేపట్టిందని వివరించారు. సమాజాన్ని మార్చగలిగే శక్తి ఒక్క విద్యకే ఉందని చెప్పు విద్యార్థులు సోషల్ మీడియా ప్రభావంతో చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఈ విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్య రక్షణ కోసం కంటైనర్ ఆస్పత్రులు, సంచార వైద్యశాలలను ఏర్పాటు చేశామని, మహిళా సాధికారత, విద్యాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గ్రామ సమీపంలోని లంక భూములను మహిళలకు కేటాయించి ఉపాధి కల్పించాలని కాటే సుబ్రహ్మణ్యం కోరగా మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇంటర్ విద్య విద్యార్థుల జీవితాన్ని మలిచే కీలక దశ అని ఈ సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు మంచి ప్రవర్తన, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచిస్తూ సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా మంత్రి సుభాష్ అందిస్తున్న సేవలను అభినందించారు. అనంతరం పదో తరగతిలో ఉత్తీర్ణులైన 50 మంది విద్యార్థినులను మంత్రి సుభాష్ జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ముందు భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కే.గంగవరం మండల అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, గంగవరం ఎస్ఐ సోమేంద్ర, రవ్వా భూషణం, కాటే సంజీవ్, కొత్తపల్లి అరుణ, పలివెల వెంకటరమణ, చిల్లి నాగేశ్వరరావు, పి.గోవింద్, ఆంజనేయులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ విద్యే సమాజ మార్పుకు ఆయుధం అని, పేదరికం వల్ల ఎవరి చదువు ఆగకూడదనే ఉదాత్తమైన ఆశయంతో అనాథ పిల్లల విద్యాభారం భరిస్తున్న మంత్రి సుభాష్ సేవలు ఎందరికో ఆదర్శమని కొనియాడారు.

# దళిత క్రైస్తవుల హక్కులకై భారీ శాంతి ర్యాలీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** మత స్వేచ్ఛను హరిస్తున్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని మరియు దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని డిమాండ్ చేస్తూ రామచంద్రపురంలో క్రైస్తవ సంఘాలు భారీ శాంతి ర్యాలీని నిర్వహించాయి. రామచంద్రపురం నియోజకవర్గ క్రైస్తవుల జాయింట్ యాక్షన్ కమిటీ (జీూజ) ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో భాగంగా క్రైస్తవ సోదరులు ప్లేకార్డులు చేతబూని తమ డిమాండ్ల సాధనకై కొద్దిసేపు మోకాళ్లపై నడుస్తూ వినూత్న రీతిలో నిరసనను వ్యక్తం చేశారు. స్థానిక రాజగోపాల్ సెంటర్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా ఆర్డీవో (=ఱూ) కార్యాలయం వరకు సాగింది. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట కొద్దిసేపు ధర్నా నిర్వహించి తమ న్యాయమైన డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ భారీ కార్యక్రమంలో మాజీ ఎంపీ హర్ష కుమార్ తనయుడు జి.వి. శ్రీరాజ్, ఎంపీపీ అంబటి భవాని, జేఏసీ నాయకులు విక్టర్ నందా, యార్లగడ్డ సామెల్ రాజ్, గునిపే విజయరాజ్, కే. సూర్య ప్రకాశం, కనికెళ్ళ సువర్ణ రాజు, కుక్కల బాలరాజు, పాము ప్రసాద్, జార్జ్ పాల్, నందిగా ప్రసాద్, మేడిశెట్టి జోయిల్, స్టీఫెన్, కే.పాల్ రాజ్, జి.విజయకుమార్, జీవన్ ప్రసాద్, పీడీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దు, వెంకటపల్లి భీమశంకరం, ప్రజాసేన అధ్యక్షుడు కాటే సుబ్రహ్మణ్యంతో పాటు నియోజకవర్గంలోని క్రైస్తవ సంఘాల పాస్టర్లు, క్రైస్తవ సోదరులు భారీ సంఖ్యలో తరలివచ్చి పాల్గొన్నారు.

# పని ఒత్తిడిని తగ్గించాలంటూ వీఆర్వోల నిరసన



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ అమరావతి రెవెన్యూ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రామచంద్రపురం మండలం వీఆర్వోలు సోమవారం నాడు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇటీవల కర్నూలు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన వీఆర్ఓ మహమ్మద్ హుస్సేన్ అధికారుల వేధింపులు, మితిమీరిన పని ఒత్తిడి తాళలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయనకు వీఆర్వోలు ఘన నివాళులర్పించారు. ఒకవైపు రీసర్వే పనులు, రెవెన్యూ రికార్డుల కంప్యూటరీకరణ వంటి కీలక బాధ్యతలు నిర్వహిస్తుండగానే మరోవైపు జనగణన మరియు ఎన్నికల కమిషన్ ఆదేశాల పేరుతో అదనపు పనులను కూడా వీఆర్వోలపై మోపడం వల్ల వారు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. ఏకకాలంలో ఇన్ని రకాల సర్వేలు, పనుల పేరుతో ఉద్యోగులను వేధించవద్దని, తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి పని ఒత్తిడిని తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మండల వీఆర్వోల అధ్యక్షులు చీకట్ల వీరాంజనేయులు, కార్యదర్శి నరహరశెట్టి సత్తిబాబు, ఉపాధ్యక్షులు సలాది చరణ్, కాకినాడ సత్యవతి, సహాయ కార్యదర్శి చామంతకుర్తి శ్రావణి, కోశాధికారి దుగ్గుదుర్తి శ్రీనివాసరావుతో పాటు మండల వీఆర్వోలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రాథమిక విద్య బలోపేతానికే ఎఫ్ఎల్ఎన్ శిక్షణ : ఆర్జేడీ జి.నాగమణి



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రాథమిక విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఒకటవ తరగతి బోధించే ఉపాధ్యాయులకు 'ఎఫ్ఎల్ఎన్' (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) శిక్షణ ఇస్తున్నట్లు పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) జి.నాగమణి పేర్కొన్నారు. రామచంద్రపురం సి.హెచ్.వి. నగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఆరు రోజుల 'జ్ఞాన ప్రకాష్' శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం కచ్చితంగా రావాలని తరగతి గది అభ్యసన సామర్థ్యాలను సాధించడంలో ఎఫ్ఎల్ఎన్ ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. పునాది అభ్యసనాన్ని బలోపేతం చేసేందుకు గత రెండేళ్లుగా ప్రాథమిక పాఠశాలల్లో దీనిని అమలు చేస్తున్నామని వివరించారు. ముఖ్యంగా ఒకటవ తరగతిలోనే విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులపై పట్టు సాధించేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆటపాటలు, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ద్వారా బోధిస్తూ చిన్నారులను పాఠశాల వైపు ఆకర్షించాలన్నారు. బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్పించేందుకు 'బడి పిలుస్తోంది' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సాధించాల్సిన పూర్తి బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ప్రస్తుతం జోన్ పరిధిలోని 7 జిల్లాల్లో గల 48 కేంద్రాల్లో దాదాపు 8 వేల మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణ పొందుతున్నట్లు ఆర్జేడీ తెలిపారు. అనంతరం జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ పి.రాంబాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,337 మంది ఒకటవ తరగతి ఉపాధ్యాయులకు ఈ శిక్షణను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణా విధానంపై ఆర్జేడీ నాగమణి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈ ఆర్ టి కోఆర్డినేటర్ ఎం.వి.వి. సత్యనారాయణ, వెన్యూ ఇంచార్జి సిహెచ్. సత్యనారాయణ, రామచంద్రపురం మండల విద్యాశాఖాధికారులు ఎం. శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి, గంగవరం మండల మండల విద్యాశాఖాధికారి సిహెచ్. ఆంజనేయులు పాల్గొన్నారు. వీరితో పాటు రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన 296 మంది ఉపాధ్యాయులు, కేఆర్పీ పైడిరాజు, డీఆర్పీలు తదితరులు హాజరయ్యారు.


# సీనియర్ జర్నలిస్ట్ ప్రభాకర్ కుటుంబానికి మంత్రి వాసంశెట్టి పరామర్శ



**ద్రాక్షారామం, విశ్వం వాయిస్ న్యూస్ :** ద్రాక్షారామం సమీపంలో ఇటీవల జరిగిన విషాదకర రోడ్డు ప్రమాదంలో సీనియర్ పాత్రికేయుడు బొమ్మ ప్రభాకర్ సోదరుడు బొమ్మ కృష్ణమూర్తి మృతి చెందడం పట్ల రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ విచారం వ్యక్తం చేశారు. సోమవారం సత్యవాడ గ్రామంలోని వారి గృహానికి చేరుకుని స్వర్గీయ కృష్ణమూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తూ నివాళులర్పించారు. ఈ రోడ్డు ప్రమాదంలో కృష్ణమూర్తి ఘటనాస్థలంలోనే మృతి చెందగా ఆయన సతీమణి దుర్గాభవాని తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే. వీరికి ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కృష్ణమూర్తి అకాల మరణం బాధాకరమని ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ భగవంతుడు కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ప్రార్థించారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మంత్రి సుభాష్ వెంట స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, మండల విద్యాశాఖ అధికారి కలిదిండి నాగరాజు, కూటమి పార్టీ నాయకులు సలాది శ్రీను, బండారు చినబాబు, పోలిశెట్టి వెంకటరావు, మేడిశెట్టి సుబ్రమణ్యం, మేడిశెట్టి పుల్లయ్య, దేవరపల్లి చక్రి తదితరులున్నారు.

# మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవత్వం

## ఐదు బాధిత కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక చేయూత



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన ఔదార్యాన్ని, మానవత్వాన్ని చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఐదు కుటుంబాలకు మొత్తం లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించి పెద్ద దిక్కుగా నిలిచారు. బాధలో ఉన్న వారికి ధైర్యం చెప్పడం, అవసరమైన సమయంలో చేయూతనివ్వడం తన బాధ్యతగా భావిస్తూ మంత్రి సుభాష్ అందిస్తున్న ఈ సహాయంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల రామచంద్రపురం రూరల్ మండలం వేగాయమ్మపేటలో జరిగిన గడ్డివాము అగ్నిప్రమాదంలో గుబ్బల సూరిబాబు అనే వ్యక్తి మృతి చెందారు. ఆ బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి సుభాష్ మృతుడి భార్య గుబ్బల మల్లేశ్వరికి రూ.30,000 ఆర్థిక సహాయం అందించి ధైర్యం చెప్పారు. అలాగే, కాజులూరు మండలం కుయ్యేరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త పెంకే నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా ఆయన కుమారుడు పెంకే సూర్య చంద్రశేఖర్‌కు రూ.30,000 ఆర్థిక సహాయం అందజేసి ఆ కుటుంబానికి మనోధైర్యం కల్పించారు. మరోవైపు పేద పురోహితులు సరస్వతి శ్రీ స్వామి విజయానంద స్వామికి వారి అవసరాల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ద్రాక్షారామం బియ్యంపేటకు చెందిన కోదూరి శ్రవణ్ కుమార్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా ఆయన కోలుకునే వరకు నెలకు రూ.10,000 చొప్పున సహాయం అందిస్తానని మంత్రి గతంలో హామీ ఇచ్చారు. ఆ మాటను నిలబెట్టుకుంటూ మూడో నెలకు సంబంధించిన రూ.10,000 నగదును శ్రవణ్ కుమార్ తల్లి జ్యోతికి అందజేశారు. వీరితో పాటు అమలాపురానికి చెందిన నిరుపేద విద్యార్థిని కేశనకుర్తి హర్షిత ఉన్నత విద్యాభ్యాసాన్ని కొనసాగించేందుకు వీలుగా రూ.20,000 ఆర్థిక సహాయం అందించి ఆమె భవిష్యత్తుకు భరోసానిచ్చారు. ఈ విధంగా వివిధ కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఐదు కుటుంబాలకు కలిపి మొత్తం రూ.1 లక్ష ఆర్థిక సహాయం చేసిన మంత్రి వాసంశెట్టి సుభాష్ సమాజం పట్ల తనకున్న బాధ్యతను మరోసారి నిరూపించుకున్నారు. కష్టకాలంలో ప్రజలకు అండగా నిలుస్తున్న మంత్రి సేవలను స్థానిక ప్రజలు, కూటమి పార్టీల నాయకులు మరియు కార్యకర్తలు హృదయపూర్వకంగా అభినందిస్తున్నారు. ఆయన చేపడుతున్న ఇటువంటి సేవా కార్యక్రమాలు మరెందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని కొనియాడారు.

# స్థానిక సంస్థల ఎన్నికలవేళ జనసేన వ్యూహారచన




**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండల కేంద్రమైన ఆలమూరులోని శ్రీ కృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో సోమవారం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు సురపరెడ్డి సత్య అధ్యక్షతన జనసేన పార్టీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించినారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనసేన పార్టీ శ్రేణులు గ్రామ స్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని బండారు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ఎన్డీఏ కూటమి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆయన సూచించారు. మండల అధ్యక్షుడు సత్య మాట్లాడుతూ మండలంలోని 18 గ్రామాల జనసేన నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, వీర మహిళలు ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని అన్నారు. ఎన్డీఏ కూటమి తరపున ఏ గ్రామంలో ఏ రిజర్వేషన్ వచ్చినా కూటమి నిర్ణయించే అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి పార్టీల మధ్య ఎలాంటి విభేదాలకు తావివ్వకుండా గ్రామాల్లో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ప్రతి గ్రామంలో జనసేన బలాన్ని మరింత పెంపొందించేలా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో జనసేన మండల నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం


## కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సమైక్య జేఏసీ ప్రతినిధులు మంత్రిని సోమవారం కలిసి భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై వినతిపత్రాన్ని సమర్పించారు. వినతిపత్రాన్ని స్వీకరించిన మంత్రి సుభాష్ సమస్యలను సానుకూలంగా పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసా ఇచ్చారు. జేఏసీ ప్రతినిధులు సమస్యలు విని కార్మికుల సమస్యలపై స్పందించిన మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే రాష్ట్రంలోని భవన నిర్మాణ కార్మికులతో ముఖ్యమంత్రి ముఖాముఖి కార్యక్రమాన్ని త్వరలో నిర్వహించాలని మంత్రిని కోరారు. సమయాభావం కారణంగా ఈసారి సుదీర్ఘంగా చర్చించే అవకాశం లేకపోయినప్పటికీ, మరోసారి ప్రత్యేకంగా సమయం కేటాయించి కార్మికుల సమస్యలపై విస్తృతంగా చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సమైక్య జేఏసీ ప్రతినిధులు అప్పారి శ్రీనివాస్, ఎం.శివకుమార్ గౌడ్, రమణాతి రవి, కోటిపల్లి రాంబాబు, గానాల సత్యసాయి, గుత్తికొండ శ్రీను, వేముల శ్రీనివాస్, గాలిదేవర వెంకటేశ్వరరావు, డి. మాచిరాజు, బి.నాగు, ఎం.సత్తిబాబు, వేమన గణపతిరావు, రామోజి శ్రీను, లక్కిశెట్టి శివనాగరాజు, దుళ్ల పోసియ్య, కొవ్వాడ చిన్నబాబు, సలాది వి.వి.ఏ.ఎస్. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవులు, ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాలి

## బాలకృష్ణన్ కమిషన్‌కు హర్షకుమార్ నివేదిక సమర్పణ - న్యూఢిల్లీలో బాలకృష్ణన్ కమిషన్‌తో మాజీ ఎంపీ హర్షకుమార్ భేటీ



**న్యూఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** దళిత క్రైస్తవులు మరియు దళిత ముస్లింలకు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) హోదాను పొడిగించే అంశంపై కేంద్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ కమిషన్‌తో అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు జి.వి. హర్షకుమార్ నేడు న్యూఢిల్లీలో అధికారికంగా భేటీ అయ్యారు. విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఈ కీలక సమావేశంలో కమిషన్ చైర్మన్, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ సహా కమిషన్ సభ్యులందరితో హర్షకుమార్ దాదాపు 20 నిమిషాల పాటు పూర్తిస్థాయిలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా దళిత మైనారిటీల సామాజిక స్థితిగతులు, మత మార్పిడి తర్వాత కూడా వారు ఎదుర్కొంటున్న కుల వివక్షను వివరిస్తూ మూడు పేజీలతో కూడిన సమగ్ర అప్డేటెడ్ రాజ్యాంగబద్ధ నివేదికను ఆయన కమిషన్‌కు సమర్పించారు. ఈ సమావేశం అనంతరం మాజీ ఎంపీ హర్షకుమార్ మాట్లాడుతూ,కేవలం మతం మారినంత మాత్రాన దళితులపై సమాజంలో ఉన్న వివక్ష లేదా వారి ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం ఏమాత్రం మారిపోవని కమిషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. మతం మారినప్పటికీ దళితులు నేటికీ పాత దళిత వాడల్లోనే, అవే దుర్భర పరిస్థితుల మధ్య నివసిస్తున్నారని, క్రైస్తవులుగా మారిన దళితులు గ్రామీణ ప్రాంతాల్లో ఆలయ ప్రవేశాల నిరాకరణను, పట్టణ ప్రాంతాల్లో ఇళ్లు అద్దెకు దొరకకపోవడం వంటి తీవ్ర సాంఘిక బహిష్కరణలను ఎదుర్కొంటున్నారని కమిషన్‌కు వివరించారు.

**కమిషన్ ముందు ఉంచిన ప్రధాన రాజ్యాంగబద్ధమైన డిమాండ్లు:**

1950 రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణ: కేవలం హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకే ఎస్సీ హోదాను పరిమితం చేస్తూ 1950లో జారీ చేసిన రాష్ట్రపతి ఉత్తర్వులను తక్షణమే సవరించాలని, మతంతో సంబంధం లేకుండా దళిత క్రైస్తవులకు, దళిత ముస్లింలకు ఎస్సీ హోదాను విస్తరించాలని కోరారు. సమానత్వ హక్కుల ఉల్లంఘన (ఆర్టికల్ 14 & 15): షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ), వెనుకబడిన తరగతులు (బీసీ) మరియు ఈడబ్ల్యూఎస్ (ఈ డబ్ల్యూ ఎస్) వర్గాల వారు మతం మారినప్పటికీ వారి సామాజిక వర్గ ప్రయోజనాలు యథాతథంగా కొనసాగుతున్నప్పుడు, కేవలం దళితుల విషయంలోనే మతం మారితే ఎస్సీ హోదాను రద్దు చేయడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు.

**ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం వర్తింపు:**

మతం మారిన దళిత మైనారిటీలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు, వారికి కూడా ఎస్సీ/ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం-1989 కింద పూర్తి రక్షణ కల్పించేలా తగిన సిఫార్సులు చేయాలని డిమాండ్ చేశారు.

**మత స్వేచ్ఛకు విఘాతం (ఆర్టికల్ 25):**

దేశంలో వివిధ రాష్ట్రాలు ప్రవేశపెడుతున్న బలవంతపు మతమార్పిడి నిరోధక చట్టాలు అత్యంత వెనుకబడిన వర్గాలను భయభ్రాంతులకు గురిచేసేలా ఉన్నాయని, ఇది ఆర్టికల్ 25 ప్రసాదించిన స్వేచ్ఛను హరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ ఒక విశిష్ట న్యాయకోవిదుడిగా, రాజ్యాంగ సూత్రాలపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తిగా ఈ సుదీర్ఘ అన్యాయానికి ముగింపు పలుకుతూ దళిత క్రైస్తవులకు, ముస్లింలకు అనుకూలంగా చారిత్రాత్మక సిఫార్సులతో కూడిన తుది నివేదికను కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తారని ఆశిస్తున్నట్లు హర్షకుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# నిరాశ్రయుల కేంద్రాన్ని మెప్మా పీడీ కనకరాజు ఆకస్మికంగా తనిఖీ

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మెప్మా, నగర పాలక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న పట్టణ నిరాశ్రయుల కేంద్రం ఎంతోమందికి పునరావాసం కల్పిస్తుందని తూర్పుగోదావరి జిల్లా మెప్మా పీడీ పీ కనకరాజు అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక కంబాల చెరువు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న పట్టణ నిరాశ్రయుల కేంద్రాన్ని కనకరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిరాశ్రయులకు అందుతున్న సేవలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. నిరాశ్రయులు వారి కుటుంబాల చెంతకు వెళ్లాలని, కష్టపడే తత్వం అలవర్చుకోవాలని,

### నిరాశ్రయ కేంద్రం ద్వారా పునరావాసం భేష్



దురలవాటులకు దూరంగా ఉండాలని కనకరాజు ఉద్బోధ చేశారు. ఎవరైనా చేతివృత్తులు నేర్చుకోవాలన్న చేతువృత్తులు వచ్చిన వారు వ్యాపారం చేసుకోవడానికి ప్రభుత్వం తగురీతిలో ప్రోత్సహిస్తుందన్నారు. నిరాశ్రయులలో కొంతమందిని వ్యాపారస్తులుగా తయారు చేయాలని నిర్వహణ ఎన్జీవో స్వర్ణాంధ్రకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్వర్ణాంధ్ర నిర్వాహకులు లైన్ డాక్టర్ గుబ్బల రాంబాబు, మెప్మా సిబ్బంది సాయి, నాగలక్ష్మి, నైట్ షెల్టర్ మేనేజర్ హరికృష్ణ సిబ్బంది రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరాశ్రయులకు నెలవారి కాస్మోటిక్ కిట్స్ కనకరాజు చేతుల మీదుగా అందించారు.



# రాజ్యసభ అభ్యర్థిగా సానా సతీష్ నామినేషన్ దాఖలు





**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు దేశం పార్టీ తరపున రాజ్యసభ ఎంపీ అభ్యర్థిగా సానా సతీష్ సోమవారం అమరావతి అసెంబ్లీ భవనంలో నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్. వనితా రాణికి ఆయన నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ నామినేషన్ ప్రక్రియలో కూటమి పార్టీల నేతలు పాల్గొని ప్రతిపాదకులుగా సంతకాలు చేశారు. రాజ్యసభ అభ్యర్థిగా సానా సతీష్ రెండు సెట్ల నామినేషన్లను సమర్పించడం విశేషం. ప్రతిపాదకులుగా చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), తంగిరాల సౌమ్య సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎం. అఖిల్ కుమార్, పి. విజయ కుమారితో పాటు కూటమి నేతలు జ్యోతుల వెంకట అప్పారావు (నెహ్రూ), వనమాడి వెంకటేశ్వ రరావు (కొండబాబు), వరుపుల సత్యప్రభ, బండారు సత్యానందరావు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిచెన్స్ వ్యతిరేకిస్తూ సిఐటియు కలెక్టరేట్ వద్ద ధర్నా

### స్కూలు ఆయాలకు, నైట్ వాచ్మెన్లకు కనీస వేతనం 26,000 చెల్లించాలని డిమాండ్




**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** సిఐటియు ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథక కార్మికులు, స్కూలు ఆయాలు, స్కూల్ నైట్ వాచ్మెన్లు ఉమ్మడిగా ధర్నా నిర్వహించారు అనంతరం గ్రీవెన్స్ లో కలెక్టర్ గారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ చంద్రమళ్ల పద్మ, సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వ శేషబాబ్జీ మాట్లాడుతూ స్కూల్లో నైట్ వాచ్మెన్ గా పని చేసే కార్మికులకు ఇచ్చే ఆరువేల జీతం 6 నెలలు బకాయి పెడితే ఎలా బ్రతుకుతారని ప్రశ్నించారు, స్కూలు ఆయాలకు ఇచ్చే 6000 జీతంలోనే చీపుర్లు, ఫినాయిల్ ఇతర సామగ్రి కొనుగోలు చేయడం దారుణం అన్నారు. కనీస వేతనం 26 వేలు చెల్లించాలని కోరారు. నిత్యవసర సరుకుల ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజనం పథక కార్మికులు వండి వార్చే మెనూ చార్జీలు విద్యార్థికి 20 రూపాయలు చెల్లించాలని, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ కిచేన్ల పేరుతో కార్మికుల ఉపాధికి కూటమి ప్రభుత్వం ఎసరు పెడుతుందని విమర్శించారు. తెల్లవారు జామున 3 గంటలకు వండే చద్దన్నం మధ్యాహ్నం పెట్టడం పిల్లలకు మంచిదా, అప్పటికప్పుడు స్థానికంగా కార్మికులతో వేడివేడిగా అన్నం వడ్డించే భోజనం వడ్డించే కావాలంటే స్మార్ట్ కిచేన్లకు వ్యతిరేకంగా విద్యార్థులు, తల్లితండ్రులు ప్రభుత్వంపై వత్తిడి తేవాలన్నారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలలో చిరుద్యోగుల వేతనాలు చెల్లించాకే మంత్రులకు, ఎమ్మెల్యేలు వేతనాలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, మునికాంత, లక్ష్మి, సుబ్బలక్ష్మి, వరలక్ష్మి, అనంతలక్ష్మి, కాదా కుమారి, వెంకటరమణ, రవణమ్మ, వెంకటలక్ష్మి, లోవరాజు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ పిజిఆర్ఎస్‌కు వచ్చే అర్జీదారులకు మజ్జిగ పంపిణీ




**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల వేదికకు వచ్చే అర్జీదారులకు కాకినాడ సిటీ ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన చలివేంద్రంను జిల్లా కలెక్టర్ హరేందిరప్రసాద్ ప్రారంభించి కార్యవర్గ సభ్యులను అభినందించిన సంగతి తెలిసిందే. ఈ సోమవారం ఎండ తీవ్రత కూడా లెక్కచేయకుండా అర్జీదారులు అధిక సంఖ్యలో రావడంతో ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన చలివేంద్రం ద్వారా మజ్జిగ సేవించి ఉపశమనం పొందారు. ఈసందర్భంగా అధ్యక్షుడు రెడ్డిపల్లి రాజేష్, కార్యదర్శి మోహన్, కోశాధికారి చైతన్య, గోపి తదితరులు మాట్లాడుతూ తమ కార్యవర్గం చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజలకు ఉపయోగపడడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రతి సోమవారం మజ్జిగ, సాధారణ రోజుల్లో మంచినీరు పంపిణీ చేస్తున్నామన్నారు. కాకినాడ నగర పాత్రికేయులు సేవాగుణం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో దురాని, సూర్యనారాయణ, ప్రసాద్, శ్రీధర్, చిన్న, సాయి, బాబ్జి, వినయ్, ఆకళ్ళ శ్రీనివాస్, గుండు శ్రీను, సోనీ, సురేష్, జగదీష్, టీంకు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదుల స్వీకరణ

### సత్వర పరిష్కారానికి జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాలు



**కాకినాడ క్రైమ్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఈరోజు (సోమవారం) నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీ ఆర్ ఎస్ ) కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్, ఐపీఎస్ మొత్తం 79 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిలో భూ తగాదాలు– 26, కుటుంబ కలహాలు 25 మరియు ఇతర విభాగాలకు చెందినవి 28గా గుర్తించబడ్డాయి. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులను ఆదేశిస్తూ, "ప్రతి ఫిర్యాదును నిశితంగా పరిశీలించి వాస్తవాలు నిర్ధారించగానే, తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, 7 రోజుల లోపు విచారణ పూర్తిచేసి, తగిన పరిష్కారం చూపాలని, వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి సమర్పించాలని సూచించారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విన్న ఎస్పీ ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని, ప్రజా సమస్యలను న్యాయపరంగా పరిష్కరించడంలో కాకినాడ జిల్లా పోలీసులు పూర్తి నిబద్ధతతో పని చేస్తున్నారని తెలిపారు.

# స్వచ్ఛమైన ఓటరు జాబితాలే లక్ష్యం

### ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలి

### బీఎల్ఓలకు కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆదేశాలు



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటరు జాబితాల రూపకల్పన లక్ష్యంగా కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలని కాకినాడ ఆర్డీవో, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ రూరల్ (ఈఆర్వో) ఎస్. మల్లిబాబు,అదనపు కమిషనర్, అర్బన్ ఈఆర్వో కె.టి.సుధాకర్, బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) ఆదేశించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కాకినాడ డివిజన్ పరిధిలో చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై సోమవారం సాయంత్రం కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ నియోజకవర్గాలకు చెందిన బీఎల్ఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో ఎస్.మల్లిబాబు మాట్లాడుతూ జూలై 1, 2026ను అర్హత తేదీగా పరిగణించి ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ప్రక్రియ నిర్వహణపై బీఎల్ఓలకు సమగ్ర శిక్షణ అందించడంతో పాటు, జూన్ 15 నుంచి జూలై 14 వరకు 30 రోజుల పాటు ఇంటింటి సర్వే (హౌస్–టు–హౌస్ ఎన్యూమరేషన్) నిర్వహించాలని సూచించారు. అలాగే జూలై 21న ముసాయిదా ఓటరు జాబితాలను ప్రచురించనున్నట్లు తెలిపారు. అనంతరం జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిములు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. వాటి పరిశీలన, నోటీసుల జారీ, క్లెయిములు మరియు అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను జూలై 21 నుంచి సెప్టెంబర్ 18 వరకు నిర్వహించి, సెప్టెంబర్ 22న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఓటరు జాబితాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించడం, అనర్హులను గుర్తించి తొలగించడం, డూప్లికేట్ నమోదులను నివారించడం, మరణించినవారు లేదా ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారి పేర్లను తొలగించడం ఈ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి దశను సమర్థవంతంగా అమలు చేసి, తప్పులేని ఓటరు జాబితాలను రూపొందించేందుకు బీఎల్ఓలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్, ఈఆర్వో కె.టి. సుధాకర్, అర్బన్ తహసీల్దార్, ఏఈఆర్వో జితేంద్ర, డిటి గోవిందరాజులుతో పాటు ఎన్నికల శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# యోగాతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సుసాధ్యం

### కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉద్ఘాటన – అన్నవరం శ్రీ సత్యదేవుని సన్నిధిలో యోగాంధ్రా 2026 కార్యక్రమం




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవుని దైనందిన జీవితంలో యోగా సాధనతో ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సుసాధ్యం అవుతుందని కాకినాడ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఉద్ఘాటించారు. దేహమే దేవాలయం అని దానిని యోగ సాధనతో పవిత్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ కోరారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేవాదాయ, పర్యాటక, ఆయుష్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో యోగాంధ్ర – వన్ ఎర్త్ – ఒన్ హెల్త్... అనే ఆకర్షణీయమైన నినాదంతో ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం రత్నగిరిపై శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో యోగాంధ్ర–2026 కార్యక్రమాన్ని ఈ నెల 7నుండి 21వ తేదీ వరకు ప్రతీ రోజూ ఉదయం భక్తులు, దేవస్థానం సిబ్బంది, స్థానిక గ్రామ ప్రజలకు యోగా శిక్షణను నిర్వహిస్తూ ఉన్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం టూరిజం డస్టినేషన్ ప్రత్యేక యోగా సాధనా కార్యక్రమాలను ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం 7–8 గంటల మధ్య నిర్వహించిన ఈ యోగా సాధన శిక్షణా కార్యక్రమంలో సుమారు 700 మంది భక్తులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఐదుగురు యోగా గురువులు, ఏడుగురు యోగా శిక్షకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరు కాగా ఆయన తోపాటు పాటు జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, పెద్దాపురం ఆర్.డి.ఓ. పి.కృష్ణమూర్తి, జడ్పీ సి.ఇ.ఓ, జిల్లా పర్యాటక అధికారి వి.వి.ఎస్. లక్ష్మణరావు, ఆలయ ఈఓ. సూర్య చక్రధర్రావు, ఆయుష్ శాఖ అధికారులు, దేవస్థానం సిబ్బంది పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడతూ నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను ఒక అలవాటుగా మార్చుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజం రూపొందుతుందని వివరించారు. సత్యదేవుని సన్నిధిలో పవిత్రమైన వాతావరణంలో యోగా చేయడం ఎంతో ప్రశాంతతను ఇస్తుంది అన్నారు. జిల్లాలో 2 లక్షల మంది ప్రజలను భాగస్వాములు చేసేలా ఈ యోగాంధ్ర 2026 కార్యక్రమలను నిర్వహిస్తున్నామని, గ్రామ, మండల స్థాయిలో నిర్వహిస్తున్న యోగా పోటీల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గోవాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పిలుపును ఇచ్చారు. అనంతరం ఆయన శ్రీ స్వామి అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. దేవస్థానం ఈవో సూర్యచక్రధర రావు, దేవస్థానం అధికారులు శ్రీ స్వామి వారి ప్రసాదాన్ని జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ అందజేశారు. ఈ యోగా దినోత్సవ కార్యక్రమంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు, దేవస్థానం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### మృతుని కుటుంబానికి

# ఆర్థిక సహాయం

### కాకినాడ ఏపీ ఎస్పీ బెటాలియన్ సిబ్బంది ద్వారా



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** గాంధీనగర్‌లో గత నెల 10వ తారీఖున హత్యకు గురైన ఏపీఎస్పీ బెటాలియన్‌కి చెందిన కానిస్టేబుల్ నాగేశ్వరరావు మృతి చెందారు. ఈ సందర్భంగా తోటి సిబ్బంది కోపరేటివ్ సొసైటీ నుండి 2,88,000 రూపాయలు చెక్కును, తోట సభ్యులు ఇచ్చిన 20 వేల రూపాయలను ఎడిషనల్ కమాండెంట్ దేవానంద్ చేతుల మీదుగా మృతుని భార్య వరలక్ష్మికి అందజేయడం జరిగింది. విధి నిర్వహణలో ఎవరు మృతి చెందిన వారిని ఆదుకునే తత్వం బెటాలియన్ కి ఉందని ఏడిషనల్ కమాండెంట్ దేవానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ మురళీకృష్ణ బివిస్సి శేఖర్ రావు, కేఎంవి మోహన్ రావు, రామ్మూర్తి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జీర్ణాశయ క్యాన్సర్లు.. ముందస్తు గుర్తింపే ప్రాణ రక్ష




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల కాలంలో ఆహారనాళం, కడుపు, పెద్దపేగు, మలాశయం, కాలేయం, పిత్తాశయం, క్లోమగ్రంథి సంబంధిత క్యాన్సర్ బారిన పడుతున్న వారి సంఖ్య ఆందోళనకర స్థాయిలో పెరుగుతోంది. ఈ ప్రాణాంతక వ్యాధి నుంచి రోగులను రక్షించి, వారి ఆయుర్దాయం పెంచాలంటే వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి. వెంటనే వైద్యులను సంప్రదించాలి. అకస్మాత్తుగా బరువు తగ్గడం, ఆకలి మందగించడం, నిరంతరంగా కడుపునొప్పి వేధించడం, నల్లటి రంగులో మలవిసర్జన జరగడం, మలంలో రక్తం పడటం, ఆహారం మింగడంలో ఇబ్బంది తలెత్తడం, తరచూ వాంతులు కావడం, కామెర్లు రావడం, కడుపులో గడ్డలు ఏర్పడటం ఈ వ్యాధి యొక్క లక్షణాలు. క్యాన్సర్‌ను తొలి దశలోనే పసిగట్టగలిగితే ఎండోస్కోపీ, శస్త్రచికిత్స, కీమోథెరపీ, ఇమ్యూనోథెరపీ, రేడియేషన్ థెరపీ, ఇంటర్వెన్షనల్ రేడియాలజీ వంటి అత్యాధునిక వైద్య విధానాల ద్వారా వ్యాధిని సమర్థవంతంగా నయం చేయవచ్చని నిపుణులు భరోసా ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో జీర్ణాశయ క్యాన్సర్ల గుర్తింపు, అధునాతన చికిత్సా విధానాలపై క్షేత్రస్థాయి వైద్యులు, శస్త్రచికిత్స నిపుణుల్లో మరింత అవగాహన పెంపొందించే ఉద్దేశంతో హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో గోదావరి ప్రాంతమైన దిండిలో జీఏపీఎస్ జీఐ ఆంకాలజీ నిరంతర వైద్య విద్యా (సీఎంఈ) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ ప్రతిష్టాత్మక సదస్సులో వ్యాధిని ముందుగానే గుర్తించడం, కచ్చితమైన దశను నిర్ధారించడం, బహుళ విభాగాల భాగస్వామ్యంతో సరైన చికిత్సా ప్రణాళికను రూపొందించడం అనే అంశాలపై వైద్యులు సుదీర్ఘంగా చర్చించారు. న్యూఢిల్లీ ఎయిమ్స్ మాజీ ఫ్యాకల్టీ, ప్రస్తుతం హైదరాబాద్ యశోద ఆసుపత్రిలో కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, హెపటాలజిస్ట్, అడ్వాన్స్డ్ ఎండోస్కోపిస్ట్ అయిన డాక్టర్ గోపి శ్రీకాంత్ ఈ సదస్సులో పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. శరీరంలో ప్రమాద ఘంటికలు మోగిన వెంటనే మేల్కొని వైద్య సలహా తీసుకుంటే క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే అంతం చేసే అవకాశాలు మెండుగా ఉంటాయని డాక్టర్ గోపి శ్రీకాంత్ స్పష్టం చేశారు. కాగా, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు మరింత చేరువగా ఆధునిక వైద్య సేవలను అందించే లక్ష్యంతో కాకినాడ నగరంలో ప్రతి నెలా రెండవ సోమవారం యశోద ఆసుపత్రి నిపుణులైన వైద్యులు తమ కన్సల్టెన్సీ సేవలను అందుబాటులో ఉంచారు.

### మండపేట ద్వారపూడి కల్వర్టు పనులు

# పరిశీలించిన ఎమ్మెల్యే వేగుళ్ళ

### రోడ్డుపనుల అలసత్వంపై ఆగ్రహం



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** ద్వారపూడి మండపేట యానం 'డి ఎం వై' ఆర్ అండ్ బి రోడ్డులో చేపట్టిన కల్వర్టు పనులను సోమవారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పరిశీలించారు. పనులు జాప్యం పై ఆర్ ఒ బి అధికారులపై ఎమ్మెల్యే వేగుళ్ళ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. 10 రోజుల్లో రోడ్డు పై రాకపోకలు సాగాలని ఆదేశించారు. ఆర్ & బి డి.ఇ టివిఎస్ సూర్యనారాయణ ను ఎమ్మెల్యే ఆదేశించారు.

### వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ

# తులా రంగారావుకు ఘన నివాళి



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేటలోని సూర్య కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర సబార్డినేట్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు నాయకత్వంలో పార్టీ శ్రేణులు తులా రంగారావు మృతి పట్ల రెండు నిమిషాలు శ్రద్ధాంజలి ఘటించి మౌనం పాటించి సంఘీభావం తెలిపారు. తులా రంగారావు మండపేట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ తొలి చైర్మన్, మాజీ జెడ్పీటీసీ గా ప్రజలకు ఎనలేని సేవ చేశారు. ద్వారపూడి గ్రామాభివృద్ధికి దశాబ్దాలు సేవ చేసి గ్రామ ప్రజల గుండెల్లో సరస్థాయిగా నిలిచారు. ద్వారపూడి రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరు కోసం అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డిపై వత్తిడి తెచ్చి సాధించారు. ఈస్ట్ కోస్ట్ రైలు స్టాప్ కూడా ఆయన కృషి వల్లే వచ్చింది. కాంగ్రెస్ పార్టీలో పలు పదవులు నిర్వహించిన ఆయన, రాష్ట్ర విభజన తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి సేవలు కొనసాగించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు, నలుగురు సోదరులు ఉన్నారు.

# ఎన్‌డిఏ సుపరిపాలన సాగుతుంది

### ఏపీ రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్

**విశ్వంవాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పౌర సమాజం ఆశీస్సులతో 2024 ఎన్నికలలో ఎన్‌డిఏ కూటమి ఘన విజయం సాధించి జూన్ 12వ తేదికి ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్నాం. జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అస్థిరత, విధ్వంసాలతో విసిగివేసారిన ప్రజలు 2024 ఎన్నికలలో వైసీపీ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కకుండా ఓడించారు. విధ్వంస పాలన నుంచి వికాసం దిశగా, అస్థిరత నుంచి సుస్థిర పాలనను అందించగలరని, అశాంతి నుంచి శాంతి దిశగా పాలనను నడిపించగలరని ఎన్‌డిఏ కూటమిని నమ్మి ప్రజలు తీర్పు ఇచ్చారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ గడిచిన రెండు సంవత్సరాలలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ.. మన బిడ్డల భవిష్యత్తు దిశగా ఎన్‌డిఏ సుపరిపాలన సాగుతున్నది. ఎన్నికలకు ముందు రాజమండ్రిలో మహానాడు వేదికలో ఇచ్చిన సూపర్–6 వాగ్దానాలన్నింటినీ అమలు చేయడమేకాక అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలనూ అమలు చేస్తున్నాం. అయినా వైసీపీ దుష్ప్రచారం చేస్తున్నది. గడిచిన రెండు సంవత్సరాల గణాంకాలను పరిశీలిస్తే.. తల్లికి వందనం ద్వారా ఎంత మంది పిల్లలు ఉన్నా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున ఇస్తామన్న హామీని అమలు చేస్తున్నాం. దీనిలో భాగంగా 67 లక్షల 27 వేల మంది పిల్లల కొరకు రూ.10,090 కోట్లను తల్లుల ఖాతాలలో జమచేయడం జరిగింది. సామాజిక పెన్షన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచాం. దివ్యాంగులకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు, కిడ్నిడయాలసిస్ పేషంట్లకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు, 85 శాతం నుంచి 100 శాతం డిజేబుల్ అయి బెడ్‌రిడన్ అయిన వారికి రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకు పెన్షన్లను పెంచడం జరిగింది. 62 లక్షల 32 వేల మందికి రూ. 65 వేల కోట్ల పెన్షన్ మొత్తాన్ని ప్రజలకు అందించడం జరిగింది. భారతదేశంలోనే రూ. 4 వేల పెన్షన్ ఇస్తూ, 26 రకాల పెన్షన్లను అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం. 2024 దీపావళి పండగ నుంచి కోటి 50 లక్షల రేషన్ కార్డుదారులలో ఒక్కొక్క మహిళకు 3 సిలెండర్ల చొప్పున 4 కోట్ల 26 లక్షల గ్యాస్ సిలెండర్‌లను పంపిణీ చేయడం జరిగింది. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం జరిగింది. 269 అన్నా క్యాంటీన్ల ద్వారా రూ.5 లకే భోజన సౌకర్యాన్ని (9 కోట్ల 71 లక్షల మందికి) అందించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. మత్స్యకారులకు రూ.15 వేల నుంచి రూ.20 వేలకు పెంచి, వేట లేని సమయంలో అందిస్తున్నాం. దీనిపై రూ.250 కోట్లు ఖర్చు చేయడం జరిగింది. ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి రూ.10 వేల నుంచి 15 వేలకు పెంచి 2 లక్షల 90 వేల మంది ఆటో డ్రైవర్లకు రూ.436 కోట్లు ఇవ్వడం జరిగింది. నారా లోకేష్ 2023 జనవరి 23వ తేదిన 'యువగళం' పాదయాత్రను ప్రారంభించారు. 5 సంవత్సరాలలో 20 లక్షల ఉద్యోగాలను కల్పించడం జరుగుతుందని హామీ ఇవ్వడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌కు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు రావడం జరిగింది. ఇది దేశంలో 25.3 శాతం గా ఉంది. ఇప్పటికే రూ.11 లక్షల కోట్లకు పైగా పెట్టుబడుల ప్రతిపాదనలు క్లియర్ చేసి కేబినెట్‌లో కూడా ఆమోదించడం జరిగింది. విశాఖపట్నం, అమరావతి, తిరుపతిలను ఎకనామిక్ జోన్స్‌గా మడు ప్రాంతాలను సమంగా అభివృద్ధి చేయడం జరుగుతున్నది. రాయలసీమలో 52 సీట్లు ఉండగా 2019లో వైసీపీ పార్టీకి 49 సీట్లు ప్రజలు ఇచ్చారు. జగన్‌మోహన్ రెడ్డి రాయలసీమ ద్రోహి అని గుర్తించిన ప్రజలు 2024 ఎన్నికలలో ఎన్‌డిఏ కూటమికి రాయలసీమలో 45 స్థానాలను కట్టబెట్టారు. ప్రజల నమ్మకాన్ని మేము నిలబెట్టుకుంటున్నాం. రాయలసీమను రూ.లక్ష కోట్లతో లార్జెస్ట్ హార్టికల్చర్ హబ్‌గా తీర్చి దిద్దుతున్నాం. ఒక పక్క సంక్షేమ కార్యక్రమాలు గత కంటే మరింత మెరుగుగా కొనసాగిస్తూ అభివృద్ధి పనులను శరవేగంగా ముందుకు తీసుకెళ్తున్నాం. వైసీపీ పాలనలో దేశంలో ఎక్కడ గంజాయి పట్టుపడినా ఆ మలాలు ఏపీలో దొరికేవి. ఎన్‌డిఏ ప్రభుత్వం వచ్చాక 'ఈగల' అనే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి గంజాయిని పూర్తిగా నిర్మూలించిన ఘనత మా ప్రభుత్వానిది. యువతను గంజాయి నుంచి విముక్తి చేయాలని దృఢసంకల్పంతో పని చేస్తున్నాం. తిరుపతిలో ఎన్‌డిఏలోని మడు పార్టీలు కలిసి సభ పెడుతున్నాం. 12వ తేదిన అమరావతిలో సుపరిపాలన పేరిట సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. రకరకాల వాగ్దానాలు చేసి 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో వెన్నుపోటుకు గురయ్యామని ప్రజలు భావించి 2024లో ఎన్‌డిఏకు ఏకోన్ముఖంగా అధికారం ఇచ్చారు. మద్యాన్ని నిషేధిస్తామని అధికారంలోకి వచ్చిన వైసీపీ మద్యం కుంభకోణం ద్వారా రూ. వేల కోట్లు దోపిడీ చేశారని విచారణలో తేలుతున్నది. ప్రజామోదం పొంది అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఏ ప్రభుత్వాన్ని నెల తిరగక ముందే బర్తరఫ్ చేయాలని, ఢిల్లీలో జగన్‌మోహన్‌రెడ్డి చేసిన విన్యాసాలు చూశాం.. వైసీపీ దుష్ప్రచారాన్ని విజ్ఞత కలిగిన ఏపీ ప్రజలు నమ్మరు.

# యోగా సంపూర్ణ జీవన విధానం

**భారతీయ సంస్కృతిలో అద్భుత వరం యోగా - సీఎం ఆశయాలకు అనుగుణంగా 'హెల్దీ, వెల్దీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' సాధనే లక్ష్యంగా ముందుకు సాగాలి**

**'యోగాంధ్ర'లో మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ కీర్తి చేకూరి, ఉన్నతాధికారులు**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతదేశానికి వేల సంవత్సరాల క్రితం లభించిన అమూల్యమైన ఆధ్యాత్మిక, శారీరక సంపద యోగా అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'యోగాంధ్ర-2026' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ప్రత్యేక సామూహిక యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్, రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా, సెంట్రల్ జైలు ఎస్పీ ఎస్. రాహుల్, జిల్లా అధికారులు, కారాగార సిబ్బంది, ఖైదీలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. యోగా శిక్షకుల ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాసనాల్లో మంత్రి, అధికారులు పాల్గొని యోగా ప్రాముఖ్యతను చాటిచెప్పారు. అనంతరం కార్యక్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదర్శన స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ యోగా కేవలం వ్యాయామ విధానం మాత్రమే కాదని, అది సంపూర్ణ జీవన విధానమని అన్నారు. నిత్య జీవితంలో యోగాను భాగస్వామ్యం చేసుకోవడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనల నేపథ్యంలో యోగా అత్యంత ప్రభావవంతమైన పరిష్కారంగా గుర్తింపు పొందిందన్నారు. ఇటీవల కేరళ రాష్ట్రానికి ప్రదానం చేసిన "బెస్ట్ టూరిజం ప్రమోషన్ స్టేట్" అవార్డు స్వీకరణ సందర్భంగా అక్కడి వెల్‌నెస్ సెంటర్ల ప్రభావాన్ని ప్రత్యక్షంగా గమనించినట్లు మంత్రి తెలిపారు. యోగా, ఆయుర్వేదం ఆధారంగా అక్కడి పర్యాటక రంగం విశేష అభివృద్ధి సాధించిందని, విదేశీ పర్యాటకులు సైతం అధికంగా ఆకర్షితులవుతున్నారని పేర్కొన్నారు. అదే నమూనాను ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేయాలనే లక్ష్యంతో రాష్ట్రంలోని 1058 కిలోమీటర్ల సుదీర్ఘ సముద్రతీర ప్రాంతాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. "ఈ రోజు ఒక్కపూట యోగా చేయడం ద్వారానే నాకు ఎంతో మానసిక ప్రశాంతత లభించింది. సంకల్పం బలంగా ఉంటే ఏదైనా సాధ్యమే. యోగా అనేది ఒక రోజు కార్యక్రమం కాదు. ఆరోగ్యవంతమైన, ఆనందమయమైన జీవితానికి ఇది శాశ్వత మార్గం" అని మంత్రి పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఇతరులను జయించడం కంటే మనల్ని మనం జయించుకోవడం గొప్ప విజయమని, అందుకు యోగా, ధ్యానం ఎంతో ఉపకరిస్తాయని తెలిపారు. సెంట్రల్ జైలు ఎస్పీ ఎస్. రాహుల్ మాట్లాడుతూ, ఖైదీలలో కోపం, నిరాశ, మానసిక ఒత్తిడిని తగ్గించి వారిలో సానుకూల దృక్పథాన్నిపెంపొందించేందుకు యోగాను దినచర్యలో భాగంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కేవలం సాధనతో సరిపెట్టకుండా 'టీచర్ టు టీచర్' కార్యక్రమం ద్వారా ఖైదీలను యోగా శిక్షకులుగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటికే 30 మంది ఖైదీలు యోగా శిక్షకులుగా మారినట్లు వెల్లడించారు. అధిక సంఖ్యలో ఖైదీలు యోగా సాధనలో పాల్గొనడం వల్ల గత ఏడాదిరాజమహేంద్రవరం సెంట్రల్ జైలు గిన్నిస్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించిందనిగుర్తుచేశారు. ఈ సందర్భంగాముఖ్యమంత్రి, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యోగా జిల్లా నోడల్ అధికారి వై మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, సెంట్రల్ జైలు ఎస్పీ ఎస్ రాహుల్, ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ, సమన్వయ అధికారి డా. విజయ కుమారి, జిల్లా అధికారులు, కారాగార శాఖ అధికారులు, సిబ్బంది, ఖైదీలు పెద్ద సంఖ్యలో పాల్గొని అత్యంత క్రమశిక్షణతో యోగాసనాలు వేశారు. క్రమశిక్షణతో పాల్గొన్న ప్రతి ఒక్కరినీ మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు.

# పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుగా ఉండాలి

**- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**



**రాజమహేంద్రవరం, నేటి వార్త :** నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుగా ఉండాలి అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగాన్ని ఆదేశించారు. సోమవారం తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, ఆరోగ్య విభాగం అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ... రానున్న వర్షాకాలం నేపథ్యంలో నగరంలో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోకుండా డ్రైనేజీల పూడికతీత (డిసిల్టేషన్) పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**సమీక్షా సమావేశంలోని ముఖ్య అంశాలు :**

నగరంలోని ప్రధాన మురుగు కాలువలు, అంతర్గత డ్రైనేజీలలో డిసిల్టేషన్ టీమ్‌లు చేస్తున్న పనులపై ఎమ్మెల్యే ఆరా తీశారు. ఇప్పటివరకు ఎంత శాతం పూడికతీత పనులు పూర్తయ్యాయి..? ఇంకా ఎంత శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి..? అనే విషయాలపై స్పష్టమైన నివేదికను నిర్దేశిత సమయానికి సమర్పించాలని ఎంహెచ్‌ఓను ఆదేశించారు.

**ముందస్తు ప్రణాళికలు తప్పనిసరి :**

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, అలాగే లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ఆరోగ్య, పారిశుధ్య విభాగం సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. డిసిల్టేషన్ టీమ్‌లు క్షేత్రస్థాయిలో చేస్తున్న పనులను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావుండకూడదని హెచ్చరించారు. నగర ప్రజల ఆరోగ్యం, రక్షణే మన ప్రథమ కర్తవ్యమని, వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నగర పాలక సంస్థ యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఈ సందర్భంగా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఆరోగ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజ్యసభ అభ్యర్థులను మర్యాద పూర్వకంగా కలిసిన బొడ్డు

**రాజ్యసభ అభ్యర్థులకు చిరు సత్కారం**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజ్యసభకు కూటమి ప్రభుత్వం తరఫున అభ్యర్థులుగా నామినేషన్ వేసిన సానా సతీష్,చింతకాయల విజయ్, భాష్యం రామకృష్ణులను జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజమహేంద్రవరం రూడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం బొడ్డు, రాజ్యసభ అభ్యర్థులతో కొద్దిసేపు ముచ్చటించి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, యువగళం అధినేత లోకేష్ ఆశీస్సులతో విజయం లాంఛనమేనని, రాజ్యసభలో రాష్ట్రం తరఫున గట్టిగా గళం వినిపించాలన్నారు. అనంతరం చింతకాయల విజయ్, సానా సతీష్, భాష్యం రామకృష్ణలకు పూలమాలలు వేసి సాల్వాతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు.

# సంక్షేమం అంటేనే జగన్ పాలన

**ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలారు - కూటమి పాలనలో మహిళలకు రక్షణ కరువైంది**

**వైయస్సార్ పార్టీ శ్రేణుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఎమ్మెల్సీ తోట**



**మండపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** సంక్షేమం అంటేనే జగన్ పాలనతోనే సాధ్యమని రాష్ట్రంలో నడుస్తోంది ఐదేళ్ల చంద్రగ్రహణం అని రాష్ట్ర సబ్ ఆర్డినేటర్ కమిటీ చైర్మన్ మండపేట వైసిపి ఇన్ ఛార్జ్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్పష్టం చేశారు.జగన్ పాలన లో సంక్షేమం అభివృద్ధి జరిగితే చంద్రబాబు పాలనలో సంక్షోభం రాజ్యం ఏలుతుందని ఎద్దేవా చేశారు.ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలారనీ విమర్శించారు. మెగా డీఎస్సీతో దళిత యువతకు అన్యాయం చేశారని విమర్శించారు.హామీలకు సమాధి వేశారని ఆరోపించారు. మండపేట పట్టణ పరిధిలోని సూర్య కన్వెన్షన్ హాల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో రౌండ్ టేబుల్ సమావేశం రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ టేబుల్ సమావేశంలో రెండేళ్ల చంద్రబాబు వెన్నుపోటు పాలనపై నిరసన వ్యక్తం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలసి నల్ల బెలూన్లను బస్టాండ్ వద్ద రాష్ట్ర సభార్డినేట్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎగరవేశారు. అనంతరం సూర్య కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కూటమి రెండేళ్ల పాలనలో చేసిన అవినీతి వికృత పాలనను ప్రజలకు వివరించే క్రమంలో ఫోటో ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేశారు. వైయస్సార్ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన 17 మెడికల్ కాలేజీల పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రైవేటీకరణ అడ్డుకున్న విధానాన్ని స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్సీ తోట వివరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైయస్సార్ నాయకులు పై చేసిన హత్యల ను తోట త్రిమూర్తులు ఖండించారు.ఆరోగ్యశాఖ వైఫల్యాలు ఎండగట్టారు. మహిళలపై యదేచ్ఛగా దారుణాలు సాగుతున్నాయని విమర్శించారు. దివ్యాంగులపై చంద్రబాబు కర్కసత్వంగా పెన్షన్లు తొలగించారని ఆరోపించారు.వారి కుటుంబాలను రోడ్డుకి ఈడ్చిన విధానాలను వివరించారు. నిరుద్యోగులకు డీఎస్సీ పేరుతో మోసపూరిత వ్యవహారాలు చేశారని పేర్కొన్నారు.ఎన్నడూ లేని విధంగా విద్యావ్యవస్థ నిర్వీర్యం చేశారని ఆరోపించారు.చిన్నపిల్లల భోజన విధానాలలో కూడా తప్పుదారి పట్టించారన్నారు. ఎస్సీలపై వివక్షతతో హాస్టల్ లో సరైన సదుపాయాలు ఏర్పాటు చేయకపోవటం పట్ల నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ప్రజల సుభిక్షంగా ఉంచాల్సిన లా అండ్ ఆర్డర్ వైఫల్యం పై విమర్శలు చేశారు. అనేక హిందూ దేవాలయాల కూల్చి వేత పై మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తుకు కీలకమైన యువతను మోసం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి వెన్నెముఖ అయిన రైతులను పూర్తిగా మోసం చేసిందన్నారు. నియోజకవర్గంలోనూ ఇసుక మట్టి దందాలు పెట్రేగిపోయాయని ధ్వజం ఎత్తారు. ఈ నెల 12 న జరిగే బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, మాజీ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు, మండపేట నియోజకవర్గం వైసీపీ పరిశీలకులు వెంకన్ననాయుడు, రాష్ట్ర వైసిపి రైతు విభాగ ఉపాధ్యక్షులు కొవ్వూరి త్రినాథ్ రెడ్డి, రాష్ట్ర వైసిపి కార్యదర్శులు కర్రి పాపారాయుడు, దూలం వెంకన్న బాబు, జిల్లా వైసిపి ఉపాధ్యక్షులు పిల్ల వీరబాబు, జడ్పిటిసి పుట్టపూడి సత్యనారాయణ, రాష్ట్ర వైసిపి బీసీ సెల్ కార్యదర్శి కుడుపూడి రాంబాబు,టౌన్ మండల వైసిపి కన్వీనర్స్ పిల్లి శ్రీనివాస్, అడబాల బాబ్జి ,వెలగల సత్యనారాయణరెడ్డి, గూటం సత్యనారాయణ, రాష్ట్ర వైసిపి పార్టీ నాయకులు యారామటి వెంకన్నబాబు,యంత్ర ప్రభాకరరావు బుజ్జీ, పలివెల సుధాకర్, వల్లూరి రామకృష్ణ , వాసిరెడ్డి అర్జున్, వైసిపి మహిళా విభాగ నాయకులు ఓగిరాల దేవి, మేడిశెట్టి సత్యవేణి, నీలం దుర్గ, జిత్తుగా వెంకట లక్ష్మి, అన్ని గ్రామాల మాజీ సర్పంచులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు,పార్టీ ప్రెసిడెంట్లు, మాజీ కౌన్సిలర్లు మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

**మండలంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను**

# పంపిణీ చేసిన బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆదేశాల మేరకు, వారి సతీమణి బత్తుల వెంకటలక్ష్మి సీతానగరం మండలం వంగలపూడి గ్రామానికి చెందిన పోలిన సత్యనారాయణకు రూ.60,274/లు, కొంచ సత్యనారాయణకు రూ. 98,273/ లు చినకొండేపూడి గ్రామానికి చెందిన ఇంద్రపాటి కుమారికి రూ. 15,180/లు, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను ఆమె స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా బత్తుల వెంకటలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ పేద ప్రజల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తుందని, నిరుపేదలు ఎవరూ కూడా వైద్య ఖర్చుల కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో శాసన సభ్యులు బత్తుల బలరామకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని ఈ సియం ఆర్ ఎఫ్ చెక్కులను త్వరితగతిన మంజూరు చేయించారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి మా కూటమి ప్రభుత్వం మరియు ఎమ్మెల్యే ఎల్లప్పుడూ అండగా ఉంటారన్నారు.చెక్కులు అందు కున్న లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు తమకు సకాలంలో ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కు, వారి సతీమణి వెంకటలక్ష్మి కి మరియు ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జేఏసీ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవుల నిరసన ర్యాలీ

**రెవిన్యూ అధికారికి యరియ పోలీస్ అధికారికి వినతి పత్రాన్ని అందించిన మండల పాస్టర్లు**



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో జేఏసీ మండల దళిత క్రైస్తవుల ఆధ్వర్యంలో 23 గ్రామాలకు చెందిన 2000 మంది క్రిష్టియన్ మత పెద్దలు విశ్వాసులు దళిత క్రైస్తవులు తమకు రక్షణ కల్పించాలని శాంతి ర్యాలీ నిర్వహించారు.లంకూరు అంబేద్కర్ విగ్రహం నుండి నాలుగు బొమ్మల సెంటర్ మండల పోలీస్ స్టేషన్ మీదుగా వెళ్లి పోలీస్ అధికారికి వినతి పత్రాన్ని అందించి మండల తహసిల్దార్ ఆఫీస్ కి వెళ్లి తహసిల్దార్ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పలువురు క్రిష్టియన్ మత పెద్దలు మాట్లాడుతూ దళిత క్రైస్తవులపై జరుగుతున్న దాడులపై మరియు దళిత క్రైస్తవులకు ఎస్సీ రిజర్వేషన్ తొలగిస్తామని కూటమి ప్రభుత్వం చేస్తున్న నిరంకుశ పాలనను వ్యతిరేకిస్తున్నామని వారు అన్నారు. ఇటీవల కాలంలో దళిత క్రైస్తవుల పై సుప్రీంకోర్టు ఇచ్చిన వ్యతిరేక తీర్పును ఖండిస్తున్నామని అన్నారు. క్రైస్తవులకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ హోదాను లేకుండా చేస్తానని అనడం సరికాదని నేడు దళిత క్రైస్తవుల ఓట్లతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గద్దె నెక్కి నేడు క్రైస్తవులపై వివక్షత చూపించడం ఎంతవరకూ సమంజసమని ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను దళితులకు లేకుండా చేస్తానని అనేవారిని గద్దెదించేవరకూ దళిత క్రైస్తవులు నిద్రపోరని అన్నారు. ప్రభుత్వాలు సక్రమంగా కొనసాగా లంటే రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 నుండి 18 వరకు కల్పించిన సమానత్వపు హక్కును,కులవివక్షత నుండి రక్షణ హక్కును అమలు చేయాలని అన్నారు.

# ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

**సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల**



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ మిగులు భూములను కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి పేద,నిరుపేదలకు వ్యవసాయ భూములను, మరియు పేదలకు ఇళ్ల స్థలాలు, ప్రైవేటు స్కూళ్లలో పేదలకు ఫీజులు తగ్గించాలని లంకూరు అంబేద్కర్ విగ్రహం వద్ద మొదటిగా పూలమాలలు వేసి నివా ళులు అర్పించి సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు అధ్యక్షతన లంకూ రు గ్రామం సీతానగరం మండల కేంద్రం వరకు పార్టీ నాయకులతో, కార్యకర్తలతో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువెల వీరబాబు తెలియజేస్తూ పేద లు,దళితులు,గిరిజనులు తదితర వర్గాల ప్రజలకు భూములను పంపిణీ చేసి,వారి ఆర్థిక పరిపుష్టికి పాలకులు,జిల్లా అధికారులు చొరవ చూపాలన్నారు. మండ లంలోని వేలాది ఎకరాలు ప్రభుత్వ మిగులు భూములు ఉన్నాయని వాటిని పేదలకు అప్పగించుటలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుం దని మండిపడ్డారు. ఎన్నిక లలో ఇచ్చిన హామీని నెర వేర్చాలని డిమాండ్ చేస్తు న్నానని పలివెల అన్నారు. లేనట్లయితే సీపీఐ ఎంఎల్ ఆధ్వర్యంలో పార్టీ ఎర్ర జెండా లు పాతి పేదలకు ప్రభుత్వ మిగులు భూములను పంపి ణీ చేస్తామని హెచ్చరిం చారు. మరికొద్ది రోజుల్లోనే జిల్లా కలె క్టర్ కార్యాలయం ఎదుట భారీ నిరసన కార్యక్రమాన్ని ఏర్పా టు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం నియోజకవర్గ సిపిఐ ఎంఎల్ పార్టీ అధ్యక్షుడు పలివెల లోకే ష్,పెద్దాపురం నియోజకవర్గ సిపిఐ ఎంఎల్ పార్టీ సెక్రటరీ కండెల్లి ఏసుబాబు,మహిళా జిల్లా అధ్యక్షురాలు కురుకూరి కృపమ్మ,మండల మహిళా ప్రెసిడెంట్ తవిటికి సునీత, జిల్లా అధ్యక్షురాలు పలివెల జ్యోతి,మండల అధ్యక్షుడు నందమూరి చిట్టి స్వామి,డొల్ల పాపారావు,మండల కమిటీ నెంబర్ వరదా దుర్గాప్రసాద్, సిద్దే నాగరాజు,డొల్ల పాపా రావు, వేటూరి నానాజీ, వేటూరి పార్వతి,షేక్ మస్తాన్ తదితర సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు, కార్య కర్తలు,అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వం రెవెన్యూ ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలి : అడుసుమిల్లి



**నేడు చలో కాకినాడ విజయవంతం చేయండి**

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఇటీవల కర్నూలు జిల్లా కర్నూలు అర్బన్ మండలంలో జిఆర్-2 వీఆర్వోగా పనిచేస్తున్న అహ్మద్ హుస్సేన్ అధిక పని బారం, ఉన్నతాధికారుల నిరంకుశ ఒత్తిడి కారణం వల్ల తీవ్ర మనస్తాపం చెంది శనివారం ఆత్మహత్య చేసుకున్న సంఘటన చాలా బాధాకరమని విఆర్ఓల అసోసియేషన్ అధ్యక్షులు అడుసుమిల్లి ప్రసాద్ చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. కోరుకొండ మండల వీఆర్వోలు తాసిల్దార్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత ఆందోళన చేపట్టారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర విఆర్వో సంఘం పిలుపు మేరకు అన్ని మండల తాసిల్దార్ కార్యాలయాల ఎదుట శాంతియుతంగా ఆందోళన చేపట్టారన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు ఓశీశీఎ మీటింగ్ ద్వారా అందరి అభిప్రాయాలూ తీసుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జతీశీ, జం,జతీఖ లకు ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. అదేవిధంగా 9వ తేదీ మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి అన్ని మండలాల నుండి తరలి వచ్చి నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అందరు vro, vs, vraలు సంఘాలకు అతీతంగా తప్పనిసరిగా హాజరై నిరసన కార్యక్రమాలు విజయవంతం చేసి జతీశీల ఐక్యతను బలంగా చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోల అసోసియేషన్ అధ్యక్షులు అడుసుమిల్లి ప్రసాద్ చౌదరి, కుంచె శ్రీనివాస్, కర్రి రాజు, గరగ సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

**రానున్న స్థానిక సంస్థలలో**

# ఎన్డీఏ అభ్యర్థులు విజయమే లక్ష్యం కావాలి

**పుష్కరాలలో మారనున్న నియోజకవర్గ రూపు రేఖలు : బత్తుల**




**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా జన సైనికులు అందరూ పనిచేయాలని రాజా నగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. సోమవారం రాజానగరం రాయల్ కన్వర్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ జనసేన ఆత్మీయ సమావేశానికి జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు బత్తుల మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులు జనసేన పార్టీలో విభేదాలు లేవనెత్తడానికి జనసేన పార్టీ కాపులది అని అసత్య ప్రచారాలు చేస్తున్నారని, జనసేన పార్టీ అన్ని కులాలది అని, నాతో సహా అందరం జనసైనికులేనని మన అధినేత పవన్ కళ్యాణ్ మాత్రమే అన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి నాయకులు కలిసికట్టుగా అభ్యర్థులను ఎంపిక చేసి, వారి విజయమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. త్వరలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి లోన్లు అందజేస్తామని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి, ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి సైనికుల పనిచేయాలని పిలుపునిచ్చారు. 2027 పుష్కరాలకు నియోజకవర్గానికి మంచి గుర్తింపుతో పాటు పలు రకాల నిధులతో అభివృద్ధి పరంగా నియోజకవర్గం రూపు రేఖలే మారనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, అడ్డాల శ్రీను, మేడిశెట్టి శివరాం, అడపా శ్రీనివాస్, యర్రంశెట్టి పోలారావు, ముక్క రాంబాబు, బదిరెడ్డి దొర, నాతిపం దొరబాబు, ఏగిశెట్టి రాజు, మైరెడ్డి గంగాధర్, దేశాల శ్రీను, విజయ శంకర్, మద్దాల ఏసుపాదం, కందికట్ల అరుణ్ కుమారి, గళ్ళ అరుణ, జన సైనికులు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డుల్లో పేరుకున్న చెత్త తొలగింపుకు టెండర్ల ఆహ్వానం



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాయవరం మండల పరిధిలోని 12 గ్రామ పంచాయతీల పరిధిలోని డంపింగ్ యార్డులు, ఇతర ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించేందుకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి వైఎన్ఎన్ గోపాల్ సోమవారం ప్రకటన ద్వారా తెలిపారు. డంపింగ్ యార్డుల్లో నిల్వ ఉన్న వ్యర్థాలను సుమారు 4 అడుగుల లోతు వరకు తవ్వి తొలగించి, సొంత ఖర్చులతో తరలించుకుపోవడానికి ఆసక్తి ఉన్న వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. ఆసక్తి గలవారు మండల కేంద్రమైన రాయవరంలో గల మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ప్రత్యక్షంగా సంప్రదించవచ్చని మరిన్ని వివరాలకు ఎంపీడీవో ఫోన్ నెం. 9121117883, డిప్యూటీ ఎంపీడీవో ఫోన్ నెం. 9440118492 సంప్రదించాలని సూచించారు.

### ఒకేరోజు విడుదలకు సిద్ధమైన ది ప్యారడైజ్, ఇరుముడి..

# ఆ హీరో సినిమా వాయిదా తప్పదా.?



ఇద్దరు పెద్ద హీరోల సినిమాలు ఒకే రోజు విడుదల కావడం అనేది చాలా కామన్. పండగ సీజన్, లేదా సమ్మర్ సమయంలో ఒకేసారి మూడు నాలుగు బడా సినిమాలు విడుదలవుతాయి. కొన్నిసార్లు పోటీ ఎక్కువైతే కొన్ని సినిమాలు వాయిదా కూడా పడతాయి. ఈ సమ్మర్ లో పెద్దగా బడా సినిమాల సందడి కనిపించలేదు. సంక్రాంతి నాలుగు, ఐదు సినిమాలు విడుదలై సందడి చేశాయి. కానీ సమ్మర్ లో మాత్రం పెద్దగా సినిమాలు విడుదలవ్వలేదు.. ఈ నెలలో విడుదలైన ఏకంగా పెద్ద సినిమా పెద్ది. బుచ్చిబాబు దర్శకత్వంలో వచ్చిన పెద్ది సినిమా బ్లాక్ బస్టర్ టాక్ సొంతం చేసుకుంది. అలాగే భారీ కలెక్షన్స్ వసూల్ చేసుకుంటూ రాణిస్తుంది పెద్ది సినిమా ఇక ఇప్పుడు రెండు బడా సినిమాలు ఒకేసారి థియేటర్స్ లో విడుదల కానున్నాయి. ఈ రెండు సినిమాల పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆగస్టు నెలలో విడుదల కానున్న బడా సినిమాలు మరేవో కాదు. నాని ది ప్యారడైజ్, అలాగే రవితేజ హీరోగా నటించిన ఇరుముడి సినిమా. నేచురల్ స్టార్ నాని నటిస్తున్న నయా మూవీ ది ప్యారడైజ్. రీసెంట్ డేస్ లో నాని వరుసగా హిట్స్ అందుకుంటూ దూసుకు పోతున్నాడు. దసరా సినిమా దగ్గర నుంచి వరుసగా హాయ్ నాన్న, సరిపోదా శనివారం, హిట్ 3 సినిమాలతో హిట్స్ అందుకుంటున్నాడు నాని. ఇక ఇప్పుడు దసరా దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో మరో మాస్ సినిమా చేస్తున్నాడు అదే ది ప్యారడైజ్. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ఆయా షేర్ సాంగ్ భారీ హిట్ అయ్యింది. ఈ సినిమా ఆగస్టులో విడుదల చేయనున్నారు. ఆగస్టు 21న సినిమా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక రవితేజ నటిస్తున్న ఇరుముడి సినిమా కూడా అదే తేదీన విడుదల చేయనున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో రవితేజ నటిస్తున్న సినిమా ఇరుముడి. ఇంటెన్స్ ఎమోషనల్ డ్రామాగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడు దర్శకుడు శివ నిర్వాణ. ఈ సినిమాలో రవితేజ గతంలో ఎన్నడూ చేయని పాత్రలో కనిపించనున్నాడు. ఈ సినిమా నుంచి విడుదలైన టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇక ఇప్పుడు ప్యారడైజ్, ఇరుముడి సినిమాలు రెండు ఒకే రోజు బరిలోకి దిగనున్నాయి. అయితే ఈ భారీ క్లాష్ నేపథ్యంలో నాని సినిమా పోస్టుపోన్ అయ్యే ఛాన్స్ ఉందని టాక్ వినిపిస్తుంది. త్వరలోనే దీని పై క్లారిటీ వస్తుందేమో చూడాలి.

### రెచ్చగొట్టడానికి ఇలాంటివి చేస్తున్నారు..

# ఇండస్ట్రీ మొత్తం ఇలానే ఉంది : నిత్యామీనన్



పెద్ది సినిమాలో జాన్వీ పాత్రను గ్లామర్ షో కోసమే చూపించారని ఫ్యాన్స్ ఫైర్ అవుతున్న సమయంలోనే.. మూవీ మేకర్స్ దిద్దుబాటు చర్యలకు దిగారు. సినిమాలోని కొన్ని అభ్యంతరకర సన్నివేశాలను వెంటనే తొలగిస్తున్నట్లు ప్రకటించారు. దర్శకుడు బుచ్చిబాబు కూడా స్పందించి.. సారీ చెప్పడంతో పాటు.. కొన్ని సీన్స్ మార్పులు చేస్తున్నట్టు చెప్పారు. పెద్ది సినిమా కేంద్రంగా ఇప్పుడు చెలరేగిన కాంట్రవర్సీ ప్రతీ డైరెక్టర్‌కు ఒక లెస్సన్‌గా మిగిలిపోవాలి. ఎన్నో అంచనాలతో.. ఫుల్ క్రేజ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన పెద్ది సినిమా.. తొలిరోజు నుంచి మంచి టాక్ తెచ్చుకుంది కాని.. ఒక హీరోయిన్ విషయంలో వస్తున్న విమర్శలు డైరెక్టర్ బుచ్చిబాబును సైతం షేక్ చేశాయి. ఈ సినిమాలో హీరోయిన్‌ను అందాలు చూపించడానికి తప్ప.. వేరే స్కోప్ లేదంటూ చాలామంది విమర్శలు చేశారు. ఇలాంటి పాత్రలు సృష్టించి ఏం మెసేజ్ ఇద్దామనుకున్నారంటూ చాలామంది సోషల్ మీడియాలో విరుచుకుపడ్డారు. అసలే పెద్ద హీరో చిత్రం. ఆయన పక్కన ఆడిపాడేందుకు హీరోయిన్ ఉండాల్సిందే. ఇది ఫక్తు తెలుగు సినిమా ఫార్ములా. దశాబ్దాల నాటి ఈ హిట్ ఫార్ములాకు ఇంకా కాలం చెల్లలేదా? అవే మూస ధోరణిని పట్టుకుని ప్రేక్షకులపై ఇంకా ఎన్నాళ్లు ఈ రుద్దుడు? ఇప్పటికే ఓటీటీల్లో హాలీవుడ్ టు కొరియన్ కంటెంట్ అందుబాటులోకి వచ్చేశాయి. ఈ తరుణంలో ఇంకా ఇలా హీరోయిన్ల శరీరంపై సీన్లు తీస్తూ డబ్బులు చేసుకుందామని ఆలోచిస్తారని ప్రేక్షకులు మండిపడుతున్నారు. ఒకప్పుడు మనకు తెలిసిన సినిమా ఇదే. అప్పుడు అంతా వర్కౌట్ అయింది. అప్పుడు ఇది సక్సెస్ ఫార్ములా మాత్రమే కాదు.. ఇలాంటి సీన్లు, పాటలు, మాటలు లేకపోతే ఏదో వెలితిగా ఉందే అంటూ సినిమాని తిరస్కరించారు ప్రేక్షకులు. కాని.. కాలం మారింది. కంటెంట్ మారింది. కాని డైరెక్టర్లు మాత్రం మారలేదు. పెద్దిలో జాహ్నవి స్కిన్‌షోపై ఆడియన్స్ విసుగెత్తిపోయారు. మంచి స్పోర్ట్స్ డ్రామాలో ఇదేం హంగామా అంటూ పెదవి విరుస్తున్నారు. అయితే హీరోయిన్ గ్లామర్‌షో మీద ట్రోల్స్ వచ్చేసరికి.. కొందరు హీరోయిన్స్ స్పందిస్తున్నారు. ఇప్పటికే అనసూయ, ఆషిక రంగనాథ్, డింపుల్ హయతి లాంటి హీరోయిన్స్ రియాక్ట్ అయ్యారు. మా తప్పేమి లేదు అంతా డైరెక్టర్స్ చెప్పిందే మేము చేస్తాం అని అంటున్నారు. తాజాగా ఇదే ఇష్యు పై హీరోయిన్ నిత్యామీనన్ కూడా రియాక్ట్ అయ్యింది. హీరోయిన్లను కేవలం గ్లామర్ డాల్స్‌గా చూపించడం ఒక్క సౌత్ సినిమాల్లోనే కాదు, మొత్తం ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ఉందని నిత్యా చెప్పుకొచ్చింది. అలాగే ఆమె మాట్లాడుతూ.. ఇప్పుడొస్తున్న సినిమాలను మరీ కమర్షియల్ చేయడమే దీనికి ముఖ్యకారణమని.. బాక్సాఫీస్ దగ్గర డబ్బుల కోసం ప్రేక్షకులను రెచ్చగొట్టడానికి ఇలాంటి సీన్స్ సినిమాల్లో పెడుతున్నారు నిత్యా చెప్పుకొచ్చింది. హీరోయిన్స్ కు కొన్ని లిమిట్స్ ఉండాలి అలాంటి సీన్స్‌లో నటించడం ఇష్టం లేకపోతే ధైర్యంగా నో చెప్పాలి. ముందు ఇలాంటి కమర్షియల్ సినిమాలను ఒప్పుకొని ఆతర్వాత ఇలాంటి సీన్స్ నేను చేయను అంటే ఎవ్వరూ పట్టించుకోరు. నేను కూడా ఇలాంటి సీన్స్ చేయాల్సి వస్తుందని చాలా కమర్షియల్ సినిమాలు వదులుకున్నా అని తెలిపింది నిత్యామీనన్.

# ఒకే సారి రెండు పదవులు.. హైదరాబాద్ కుర్రోడికి డబుల్ ధమాకా




తిలక్ వర్మకు భారత్ ఏ జట్టు కెప్టెన్సీ బాధ్యతలు బీసీసీఐ అప్పగించింది. శ్రీలంక వన్డే సిరీస్‌లో జట్టును నడిపించనున్నాడు. రోహిత్ శర్మ సూచనలు ప్రస్తావిస్తూ హార్దిక్ పాండ్యా పేరు లేకపోవడం చర్చనీయాంశమైంది. వైస్ కెప్టెన్‌గా కూడా అతనికి పదవి దక్కింది. భారత యువ క్రికెటర్, హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మకు బీసీసీఐ కీలక బాధ్యతలను అప్పగించింది. శ్రీలంక పర్యటనకు వెళ్లే భారత ఎ జట్టుకు కెప్టెన్‌గా తిలక్‌ను నియమిస్తూ బోర్డు నిర్ణయం తీసుకుంది. అక్కడ జరగబోయే ముక్కోణపు వన్డే సిరీస్‌లో తిలక్ వర్మ భారత జట్టును ముందుండి నడిపించబోతున్నాడు. ఈ టోర్నమెంట్‌లో భారత్‌తో పాటు శ్రీలంక 'ఎ', ఆఫ్ఘనిస్తాన్ 'ఎ' జట్లు తలపడనున్నాయి. ఈ ప్రతిష్టాత్మక ముక్కోణపు సిరీస్ జూన్ 9 నుంచి జూన్ 21, 2026 వరకు జరగనుంది. టోర్నీలోని అన్ని మ్యాచ్‌లకు శ్రీలంకలోని ప్రసిద్ధ రంగిరి దంబుల్లా ఇంటర్నేషనల్ స్టేడియం ఆతిథ్యం ఇవ్వబోతోంది. ఈ సిరీస్ డబుల్ రౌండ్-రాబిన్ ఫార్మాట్‌లో సాగుతుంది. అంటే ప్రతి జట్టు మిగిలిన రెండు జట్లతో రెండేసి సార్లు తలపడుతుంది. లీగ్ దశ ముగిసే సమయానికి పాయింట్ల పట్టికలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు జూన్ 21న జరిగే ఫైనల్ మ్యాచ్‌లో తలపడతాయి. గెలిచిన జట్టుకు 2 పాయింట్లు, డ్రా అయితే 1 పాయింట్ ఇస్తారు.

**రోహిత్ శర్మకు క్రెడిట్.. పాండ్యాకు హ్యాండ్**

ఈ టోర్నీ ప్రారంభానికి ముందు తిలక్ వర్మ రెవ్‌స్పోర్ట్జ్?కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కెప్టెన్సీపై కొన్ని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. తాను నాయకత్వ బాధ్యతల గురించి సీనియర్ ఆటగాళ్లతో ఎప్పుడూ చర్చిస్తూ ఉంటానని చెప్పాడు. ముఖ్యంగా రోహిత్ శర్మతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నాడు. అయితే ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా ఉన్న హార్దిక్ పాండ్యా కింద తిలక్ వర్మ ఆడినప్పటికీ.. కెప్టెన్సీ పాఠాల గురించి మాట్లాడుతూ హార్దిక్ పేరును అస్సలు ఎత్తకపోవడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది.

**ఒత్తిడిని ఎలా జయించాలో చెప్పిన రోహిత్**

తన ఇంటర్వ్యూలో తిలక్ మాట్లాడుతూ.. 'నేను రోహిత్ భాయ్‌తో మాట్లాడినప్పుడల్లా మా మధ్య ఎక్కువగా బ్యాటింగ్ గురించి చర్చ రాదు. మేము కెప్టెన్సీ గురించే మాట్లాడుకుంటాం. మైదానంలో తీవ్రమైన ఒత్తిడి ఉన్నప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి, చిన్న చిన్న విషయాలపై ఎలా దృష్టి పెట్టాలి అనే విషయాలను రోహిత్ భాయ్ నాకు క్లియర్‌గా వివరించాడు. ఆయన ఇచ్చిన సలహాలు, నేర్పిన పాఠాలను రాబోయే మ్యాచ్‌ల్లో ఖచ్చితంగా ఉపయోగిస్తాను' అని తిలక్ వర్మ చెప్పుకొచ్చాడు.

**టీ20 జట్టుకు వైస్ కెప్టెన్‌గా ప్రమోషన్**

తిలక్ వర్మకు కేవలం ఇండియా 'ఎ' కెప్టెన్సీ మాత్రమే కాదు.. ఏకంగా సీనియర్ టీమిండియా టీ20 జట్టు వైస్ కెప్టెన్సీ పదవి కూడా దక్కింది. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లాండ్ టీ20 సిరీస్‌ల కోసం కొత్తగా నియమితుడైన కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు వైస్ కెప్టెన్ గా తిలక్ వర్మ బాధ్యతలు చేపట్టనున్నాడు. శ్రీలంక ముక్కోణపు సిరీస్ ముగిసిన వెంటనే తిలక్ ఐర్లాండ్‌కు బయలుదేరి వెళ్తాడు. అక్కడ జూన్ 26, జూన్ 28 తేదీల్లో రెండు టీ20 మ్యాచ్‌లు జరగనున్నాయి.

**తిలక్ వర్మ కెప్టెన్సీ రికార్డులు ఇవే**

తిలక్ వర్మకు కెప్టెన్సీ చేయడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ అతను పలు టోర్నీల్లో భారత్‌ను విజయవంతంగా నడిపించాడు. 2024 చివర్లో ఒమన్‌లో జరిగిన ఎమర్జింగ్ ఆసియా కప్‌లో ఇండియా 'ఎ' జట్టుకు తిలక్ నాయకత్వం వహించాడు. అంతేకాకుండా, స్వదేశంలో సౌతాఫ్రికా 'ఎ' జట్టుతో జరిగిన మూడు మ్యాచ్‌ల అఫీషియల్ వన్డే సిరీస్‌లోనూ తిలక్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. అతని కెప్టెన్సీలోనే భారత్ ఆ సిరీస్‌ను 2-1 తో గెలుచుకుని సత్తా చాటింది. మైదానంలో ప్రణాళికలు రచించడంలో తిలక్ వర్మకు మంచి పట్టు ఉందని ఈ రికార్డులు నిరూపిస్తున్నాయి.

# ధోనీ స్టైల్‌లో జర్నలిస్ట్‌కు చుక్కలు చూపించిన హర్మన్‌ప్రీత్ కౌర్




హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో రిటైర్మెంట్ ప్రశ్నకు ధోనీ స్టైల్‌లో సమాధానం ఇచ్చి వైరల్ అయ్యింది. ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ 2026 నేపథ్యంలో ఆమె రిప్లై అభిమానులను ఆకట్టుకుంది. భారత్ జట్టు పాక్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది. భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. ఐసీసీ ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ 2026 ప్రెస్ మీట్‌లో ఒక జర్నలిస్ట్ అడిగిన రిటైర్మెంట్ ప్రశ్నకు ఆమె ఇచ్చిన అదిరిపోయే రిప్లై అందరినీ ఆశ్చర్యపరిచింది. ఈ సమాధానం చూసిన నెటిజన్లు, క్రికెట్ ఫ్యాన్స్.. గతంలో మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ ప్రెస్ మీట్‌లో చేసిన హల్‌చల్‌ను గుర్తు చేసుకుంటున్నారు. ఈ ఏడాది ఉమెన్స్ టీ20 వరల్డ్ కప్ టోర్నమెంట్ జూన్ 12 నుంచి జూలై 5 వరకు ఇంగ్లాండ్, వేల్స్ వేదికగా జరగనుంది. ఈసారి సరికొత్తగా మొత్తం 12 జట్లు ఈ మెగా టోర్నీలో తలపడబోతున్నాయి. వీటిని రెండు గ్రూపులుగా విభజించారు. ప్రతి గ్రూప్‌లో ఆరు జట్లు ఉంటాయి. లీగ్ దశలో ప్రతి జట్టు ఐదు మ్యాచ్‌లు ఆడుతుంది. ఆ తర్వాత రెండు గ్రూపుల నుంచి టాప్-2 లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి.

**తొలి మ్యాచ్‌లోనే పాకిస్తాన్‌తో ఢీ**

ఈ టోర్నీలో భారత జట్టు అత్యంత కఠినమైన గ్రూప్-ఎ లో ఉంది. ఆరుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన బలమైన ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, బంగ్లాదేశ్, నెదర్లాండ్స్, చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌లతో భారత్ పోటీ పడాల్సి ఉంది. భారత్ తన తొలి మ్యాచ్‌లోనే జూన్ 14న పాకిస్తాన్‌తో తలపడనుంది. ఈ ప్రతిష్టాత్మక టోర్నీ ప్రారంభానికి ముందు ఐసీసీ అధికారికంగా 12 జట్ల కెప్టెన్లతో ఒక సంయుక్త ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించింది.

**రిపోర్టర్‌తో హర్మన్‌ప్రీత్ ఫన్నీ చాట్**

ఈ ఇంటరాక్షన్ సమయంలో ఒక రిపోర్టర్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను టార్గెట్ చేస్తూ.. 'ఇది మీకు చివరి వరల్డ్ కప్ కాబోతోందా?' అని ప్రశ్నించాడు. దానికి హర్మన్‌ప్రీత్ ఏమాత్రం తడుముకోకుండా వెంటనే ఎందుకు? అని అడిగింది. దానికి సదరు రిపోర్టర్ 'నేను ఊరికే అడుగుతున్నాను' అని కవర్ చేయబోయాడు. వెంటనే హర్మన్‌ప్రీత్ 'నేను క్రికెట్ ఆపాలని మీరు అనుకుంటున్నారా?' అని రివర్స్ కౌంటర్ ఇచ్చింది. దానికి రిపోర్టర్ 'అలా ఏం లేదు' అని అనడంతో.. 'మరి ఇంకెందుకు ఈ ప్రశ్న అడుగుతున్నారు?' అంటూ నవ్వుతూనే క్లాస్ పీకింది.

**2016 నాటి ధోనీ ఇంటర్వ్యూ గుర్తొచ్చింది**

ఈ సీన్ చూసిన వారంతా 2016 టీ20 వరల్డ్ కప్ సమయంలో ఎంఎస్ ధోనీ ఆస్ట్రేలియా జర్నలిస్ట్ శామ్ ఫెరిస్‌కు ఇచ్చిన కౌంటర్‌ను గుర్తు చేసుకుంటున్నారు. అప్పట్లో ధోనీని రిటైర్మెంట్ గురించి అడగ్గా.. ధోనీ ఆ రిపోర్టర్‌ను తన పక్కన కూర్చోబెట్టుకుని సరదాగా ప్రశ్నలు అడిగి నవ్వించాడు. ఇప్పుడు హర్మన్‌ప్రీత్ కౌర్ కూడా అదే పీక్ ధోనీ స్టైల్‌లో రిపోర్టర్ నోరు మూయించడంతో ఫ్యాన్స్ ఆమెపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

**హర్మన్‌ప్రీత్ కౌర్ అద్భుత కెరీర్ రికార్డులు**

2009లో అంతర్జాతీయ క్రికెట్లోకి అడుగుపెట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్.. భారత్‌లో అత్యంత విజయవంతమైన మహిళా కెప్టెన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. ఇప్పటివరకు ఆమె 197 టీ20 మ్యాచ్‌లు ఆడి 4,075 పరుగులు చేసింది. ఇందులో ఒక సెంచరీ, 17 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఆమె కెప్టెన్సీలోనే భారత్ 2023 ఆసియా గేమ్స్‌లో గోల్డ్ మెడల్, 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. అలాగే 2020లో టీ20 వరల్డ్ కప్ ఫైనల్ చేరింది. ఈసారి ఎలాగైనా కప్పు గెలవాలనే పట్టుదలతో భారత్ బరిలోకి దిగుతోంది.






VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com